
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 02.12.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 26 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## మారేది ప్రజలా? ప్రధానా?



- మోడీకి పొంచివున్న పదవీగండం
- యూపి, పంజాబ్ ఎన్నికల ఫలితాలతో మార్పులు
- ప్రధాని ఏకపక్ష వైఖరిపై బీజేపీలోనూ అసంతృప్తి

**పెద్ద నోట్ల రద్దు... దేశమంతా ఇది తీవ్ర సంచలనం కలిగిస్తోంది. ప్రతిపక్షాలు ప్రతిరోజూ విరుచుకుపడుతున్నాయి. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదంతా మనకు బయటకు కనిపిస్తున్న వాతావరణం. మరి ఇంతటి ఆర్థిక విప్లవానికి కారణమైన బీజేపీలో దీని ప్రభావం ఎలా ఉండబోతోంది? పార్టీలో దీనిపై ప్రస్తుతం ప్రశాంతంగానే వుంది. కాని, పార్టీలో ప్రస్తుతానికి అది పేలని, ఎప్పుడు పేలుతుందో తెలియని డైనమేట్‌గా వుంది. అవును ఇది నిజం. పచ్చి నిజం.**

పెద్దనోట్ల రద్దును ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నా, బీజేపీ సమర్థిస్తుందనుకుంటే పొరపాటే! బీజేపీలో కార్యకర్తలను తీసి పక్కనపెడితే నూటికి 90శాతం ఎంపీలు ప్రధాని నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇలా వ్యతిరేకించడానికి వాళ్ల కారణాలు వారికుంటాయి. కాకపోతే బయటపడలేకపోతున్నారు. ప్రస్తుతం బీజేపీలో నరేంద్రమోడీయే బలమైన నాయకుడు. ప్రజాకర్షణ వున్న పాలకుడు. కాబట్టి ఆయన నిర్ణయాలను ధిక్కరించే ధైర్యం ఎవరూ చేయలేరు. పార్టీ తనను కాదని ఎక్కడికీ పోలేదనే ధైర్యం ఉండబట్టే నరేంద్ర మోడీ పార్టీ సీనియర్లను సంప్రదించకుండా, కనీసం కేబినెట్‌లో చర్చించకుండా చారిత్రాత్మకమైన ఈ నిర్ణయాన్ని ప్రకటించేశాడు.

పెద్దనోట్ల రద్దు ప్రభావం బీజేపీకి రాజకీయంగా ప్రయోజనం ఉంటుందా? నష్టం కలిగిస్తుందా? అన్నది ప్రశ్న. పెద్దనోట్ల రద్దు పర్యవసానాలకు పూర్తి బాధ్యత ప్రధానిగా నరేంద్ర మోడీదే! అయితే బీజేపీకి ఇది లాభిస్తుందా, నష్టపరుస్తుందా అని తెలుసుకోవడానికి 2019 లోక్‌సభ ఎన్నికల దాకా ఆగనవసరం లేదు. త్వరలో ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎన్నికలున్నాయి. దీని పర్యవసానం ఏంటన్నది ఆ ఎన్నికల ఫలితాలలోనే తేటతెల్లం కాబోతుంది.

నోట్ల రద్దు అన్నది దేశ వ్యాప్త సమస్య కాబట్టి యూపీ, పంజాబ్‌లలోనూ దాని ప్రభావం ఉంటుంది. ఖచ్చితంగా ఎన్నికల్లో అది పనిచేస్తుంది. పెద్దనోట్ల రద్దు నిర్ణయం ముందువరకు యూపీలో బీజేపీ పెద్ద పార్టీగా అవతరిస్తుందని, పంజాబ్‌లో మాత్రం అధికారం కోల్పోతుందని (మిగతా 11వ పేజీలో)

## కమ్ముకొస్తున్న కరువు



- ఆందోళనలో జిల్లా రైతాంగం
- 'నాడా'తో నైనా నాట్లు పడేనా?

జిల్లా రైతాంగాన్ని కష్టాలు వీడడం లేదు. అటు రబీ అయినా, ఖరీఫ్ అయినా ఏదో ఒక బాధ వుండనే వుంటోంది. అదునుకు పదునైన వర్షాలు కురవాల్సిన సమయంలో చినుకు కనిపించదు. కోతకొచ్చి పంటలు చేతికందే సమయంలో మాత్రం మబ్బులు చిల్లుకుండల్లా తయారై ఒకటే వాన. ఒకసారి వర్షాభావం... మరోసారి కుండపోత వానలు అన్నదాతలకు కంటికి కడివెడు కన్నీరు మిగిలిస్తూనే వున్నాయి. (మిగతా 11వ పేజీలో)

- నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాల గతి ఇంతేనా?



## సీట్లకు కోత.. చదువుకు వాత

**నెల్లూరులో ప్రభుత్వ వైద్యకళాశాల ఎన్నో దశాబ్దాల కల. నెల్లూరీయుడైన స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కూడా నెల్లూరుకు వైద్యకళాశాలను తీసుకు రాలేకపోయాడు. అలాంటిది గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరుకు వైద్యకళాశాలను మంజూరు చేయించారు. నిధులు విడుదల చేసి కాలేజీని పూర్తి చేయించి, ఆ కాలేజీకి తమ పెదనాన్న స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి పేరు కూడా పెట్టుకోవడం జరిగిపోయింది. కాలేజీ పూర్తి చేసింది ఒకరైతే దానిని ప్రారంభించింది మాత్రం 2014లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్య నాయుడులు కావడం విశేషం.**

అయితే ప్రభుత్వ వైద్యకళాశాలను ఏ ముహూర్తాన ప్రారంభించారోగాని దానికి ఇంకా బాలారిష్టాలు తొలగలేదు. ప్రభుత్వ వైద్యకళాశాలలో చోటుచేసుకున్న లోపాలను భారతీయ వైద్యమండలి ప్రతిఏటా ఎత్తి చూపుతూనే వుంది. సరైన వైద్యవిద్యా ప్రమాణాలు పాటించకపోవడం, బోధనా సిబ్బంది కొరత, మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం, కాలేజీ అనుబంధ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు అధ్వాన్నంగా ఉండడం వంటి కారణాలతో ఈ ఏడాది నెల్లూరు ప్రభుత్వ (మిగతా 11వ పేజీలో)



# దోపిడీ ముఠా అరెస్ట్

• రూ.7.5లక్షలు స్వాధీనం

నెల్లూరు నగర పరిధిలో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని వారిని మోసం చేసి బెదిరించి డబ్బు తీసుకుని పరారయ్యే ముఠాను నెల్లూరు బాలాజీనగర్ పోలీసులు సోమవారం అరెస్ట్‌చేసి వారి నుండి రూ. 7. 5లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ ఆ వివరాలు తెలియజేశారు. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలానికి చెందిన వడ్ల దళారి విజయకుమార్ తనవద్దనున్న పాత వెయ్యి, 500నోట్లు రూ. 10లక్షలను కమిషన్ తీసుకుని కొత్తనోట్లు మార్చివ్వాలని తన స్నేహితుడైన ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన సి. హెచ్. సతీష్‌బాబును కోరాడు. దీంతో సతీష్‌బాబు తనవద్దనున్న కొత్త నోట్లను ఇస్తానని చెప్పి గత నెల 22వ తేదీ మధ్యాహ్నం 3గంటల సమయంలో బాలాజీనగర్‌లోని పద్మావతి గ్రీన్‌సిటి వద్దకు వచ్చి విజయకుమార్‌తో మాట్లాడుతుండగా, గుర్తు తెలియని 6మంది వ్యక్తులు అక్కడికి వచ్చి పోలీసులమంటూ వారిని బెదిరించి సతీష్‌బాబు వద్దనున్న రూ. 8. 5లక్షలు దోచుకెళ్లారు. సతీష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ సిఐ సంగమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా దర్యాప్తులో అల్లూరు మండలం గొల్లపాలెంకు చెందిన ఒట్టూరు మల్లిఖార్జున్ అనే వ్యక్తి తన స్నేహితులైన కప్పరాళ్ళతిప్ప ప్రాంతానికి చెందిన పాత నేరస్తులు సముద్రాల ఫిలిప్, గుంజి ఏసోబు, పోర్సు శీను, బచ్చు సుబ్బయ్యలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ. 7. 50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేధించడంలో కృషి చేసిన సిఐ సంగమేశ్వరరావు, ఎస్సై భాస్కర్, సిబ్బందిని ఎస్పీ విశాల్‌గున్నీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

## శబరిమలైకి ఆర్టీసి ప్రత్యేక ప్యాకేజీ

శబరిమలై యాత్ర సందర్భంగా శబరిమలైకి వెళ్ళే భక్తస్వాముల కోసం ఆర్టీసి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. శబరిమలైకి ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. బృందాలుగా ఏర్పడిన భక్తస్వాములకు ఆర్టీసి బస్సులను అద్దె ప్రాతిపదికన కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో, భక్తులకు అనువైనవిధంగా ఆర్టీసి ప్యాకేజీని ఏర్పాటు చేసింది. డిసెంబర్ 1 నుంచి ఈ బస్సులను శబరిమలైకి నడుపుతున్నారు. డిసెంబర్ 1, 4, 6, 9, 10, 15, 18, 20, 23, 31, జనవరి 4, 7, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయి. ఈ సర్వీసులను జిల్లాలోని అన్ని డిపోల నుంచి నడుపుతున్నట్లు ఆర్టీసి వర్గాలు పేర్కొంటున్నాయి. 4 రోజుల ప్యాకేజీ టూర్‌కు రాను పోను ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ రూ. 3,300, అల్ట్రా డీలక్స్ రూ. 3,000, ఎక్స్‌ప్రెస్‌లో రూ. 2 వేల వంతున ఛార్జీలు వుంటాయి. ఈ ప్యాకేజీలో భాగంగా కేరళ ప్రభుత్వ సహకారంతో భక్తులకు మరిన్ని సదుపాయాలు అందనున్నాయి. పంబ సమీపంలో నిలక్కల్ వద్ద ఆర్టీసి ద్వారా ప్రయాణీకులకు సేవలందించేందుకు ప్రత్యేక క్యాంప్ కార్యాలయం కూడా ఏర్పాటుచేస్తున్నారు. అక్కడ మెకానికల్ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో వుంటారు. మార్గమధ్యంలో కేరళ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దేవాలయాల్లో దైవదర్శనంతో పాటు, ఉచిత సదుపాయాలను కల్పిస్తారు. ఈ బస్సులను బుక్‌చేసుకునేందుకు 7382926410, 7382883003 నంబర్లకు గానీ, లేదా నేరుగా ఆర్టీసీ డిపోల్లోగాని సంప్రదించవచ్చని ఆర్టీసి వర్గాలు తెలిపాయి.

## భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం

పవిత్రమైన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నాయుడుపేట పట్టణంలో ఆదివారం రాత్రి లక్ష దీపోత్సవ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా జరిగింది. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మన సంస్కృతి ఎంతో మహోన్నతమైనదని, మన ధర్మాన్ని మనం పరిరక్షించుకోవాలని ఆయన ఈ సందర్భంగా భక్తులకు ఉద్బోధించారు. చిన్నతనం నుంచి మన సంస్కృతి సంప్రదాయాలను అలవరచుకుంటే పెద్దల పట్ల గౌరవం ఏర్పడు తుందని, మంచితనంతో సన్మార్గం సిద్ధిస్తుందని అన్నారు. నాయుడుపేటలోని పెసల జయప్రకాష్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో మహిళలు విచ్చేసి లక్షదీపోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపకాంతులతో, భక్తుల శివనామ స్మరణలతో ఆ ప్రాంతమంతా శోభాయమానమైంది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లాశాఖ కార్యదర్శి రాజారెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు రవిశర్మ, గాదంశెట్టి మోహన్‌రావు, గాదంశెట్టి వెంక టేశ్వర్లు, పెసల జయబాబు, టి శ్రీనివాసులు, జలదంకి మధుసూదన్‌రెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, చదలవాడ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతాంగానికి పరిహారం

గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన జిల్లా రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం నుంచి 45 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, డిసెంబర్ ఆఖరుకల్లా ఆ వరద నష్టపరిహారాన్ని రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ధనుంజయరెడ్డి తెలిపారు. గత నెల 26న ఆయన దొరవారిసత్రం మండలంలోని ఉచ్చూరు, మంగళంపాడు గ్రామాల్లోని ఎల్లిపైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ, ఈ ఏడాది ఆలస్యంగా వానలు కురిస్తే మినుము, వేరుశనగ, మిరప, పెసలు, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. రైతులు సాగు చేయదలచుకున్న ఆరుతడి పంటలకు సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామన్నారు.

### పెద్దనోట్ల రద్దుపై...

# వెల్లువెత్తిన నిరసన





సింహపురి సమాచారం

పెద్దనోట్లు రద్దుకు నిరసనగా వైయస్సార్సీపీ, వామపక్షాలు, కాంగ్రెస్‌పార్టీలు సోమవారం నిర్వహించిన హర్తాళ్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించారు. కళాశాలలు, పాఠశాలలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేసి ఆందోళనకు మద్దతు తెలిపారు.

వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి నెల్లూరుజిల్లా వెంకటాచలంలో హర్తాళ్‌లో పాల్గొన్నారు. ముత్తుకూరు, టి.పి.గూడూరు, పొదలకూరు, మనుబోలులో వామ పక్షాలు, వైయస్సార్సీపీ ఆధ్వర్యంలో హర్తాళ్ నిర్వహించారు.

నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి విఆర్ కళాశాల వరకు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ వైయస్సార్సీపీ నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్ట వద్దగల దూరదర్శన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి పార్థసారధి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన జరిపారు.

నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వెంకటగిరిలో క్రాస్‌రోడ్డు నుంచి కాశీపేట మీదుగా పోలేరమ్మ ఆర్చి సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. పాఠశాలలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు.

నాయుడుపేట పట్టణంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో హర్తాళ్ జరిగింది. కోవూరు బజార్ సెంటర్ నుంచి మందబైలు సెంటర్ వరకు పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెంలో సిపిఎం నాయకులు ముంబాయి జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని ఇందిరాభవన్ నుంచి నర్తకి సెంటర్, ఏసి సెంటర్ మీదుగా గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య పాల్గొన్నారు.

గూడూరులో వైయస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ఆర్ అండ్ బి అతిథిగృహం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు.

కావలిలో వామపక్షాల ఆధ్వర్యంలో జెండా చెట్టు వరకు ప్రదర్శన చేసి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు.

ఆత్మకూరులో వైయస్సార్సీపీ వామపక్షాలు నిర్వ హించిన హర్తాళ్ విజయవంతమైంది. ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంత సాగరం, మర్రిపాడు, చేజర్ల, సంగం మండలాల్లో పార్టీల నాయకులు నిరసన ప్రదర్శనలు, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మోటారు సైకిళ్ళ ర్యాలీ, రాస్తారోకోలు నిర్వహించారు.

ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి మండలాల్లో హర్తాళ్ నిర్వహించారు. వింజమూరులో గణపం బాలకృష్ణారెడ్డి, ఎం.విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బంద్ జరిగింది. హర్తాళ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 249మందిని అరెస్ట్ చేసి, బైండోవర్ కేసులు నమోదు చేసి విడిచి పెట్టారు.

## పేదల సంక్షేమమే 'దేశం' లక్ష్యం

పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ అన్నారు. ఆదివారం ఆయన నాయుడుపేట మండలంలోని భీమవరం, మేనకూరు గ్రామాల్లో జరిగిన జనచైతన్యయాత్రలో పాల్గొన్నారు. మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం స్వగ్రామంలో 75 లక్షలతో నిర్మించిన తారురోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. పదేళ్ళ కాంగ్రెస్ పాలనలో ఆ నాయకులు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను సగం కూడా అమలుచేయలేదని, రెండున్నరేళ్ళ హయాంలో టిడిపి 75 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. మేనకూరులోని కర్మాగారాల్లో యువతకు ఉపాధి కల్పనకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి నెలవల మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీగా నిధులు విడుదల చేస్తున్నారని అన్నారు. మాజీమంత్రి పరసా రత్నం, జడ్పీ ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగదు రహిత లావాదేవీలతోనే దేశాభివృద్ధి

### - నగర డిఎస్పీ జి.వెంకటరాముడు

నగదు రహిత లావాదేవీలతోనే దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందని, ఈ విధానంతో ఎన్నో ఉపయోగాలున్నాయని, వాటిని ప్రజలు అవగాహన చేసుకోవాలని నెల్లూరు డిఎస్పీ జి. వెంకటరాముడు అన్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని విఆర్‌సి నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు, వ్యాపారస్తులు అందరూ ఆర్థిక లావాదేవీలన్నీ చెక్‌లు, డిడిలు, కార్డుల ద్వారా నిర్వహిస్తే ప్రభుత్వానికి చెందాల్సిన పన్నులు అన్నీ సక్రమంగా అందుతాయని, తద్వారా దేశాభివృద్ధికి దోహదం చేసినట్లవుతుందని అన్నారు. నగదు రహిత లావాదేవీలను అందరూ అర్థం చేసుకుని ఆచరిస్తే దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఈ విషయమై విద్యార్థులు, మేధావులు ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐలు షేక్ అబ్దుల్ కరీమ్, రామకృష్ణారెడ్డి, రామారావు, సీతారామయ్య, మంగారావు, సంగమేశ్వరరావు, ఎస్‌ఐలు, బ్యాంక్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదులో అవకతవకలు

ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలంటూ మంగళవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల నాయకులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, శ్రీరాములు, వెంకమరాజు, ఎం.వి.రమణ డిమాండ్ చేశారు. బుచ్చిరెడ్డిపాలెంలో 174మంది ఉపాధ్యాయులు, 870మంది పట్టభద్రుల ఫారంలను అప్‌లోడ్ చేయలేదన్నారు. నెల్లూరులో 219 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుంటే జాబితాలో 89మంది పేర్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఓటర్ల నమోదులో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు షాహినా బేగం, యు.ప్రసాద్, కోటేశ్వరరావు, పెంచల నరసయ్య, సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు చేయూత

నెల్లూరు వేదాయపాళెం మహాత్మా గాంధీనగర్‌లో వున్న మహిళా ప్రాంగణం లోని సేవాసదనంలో నిరాశ్రయ మహిళలకు, అనాధలు, వితంతువులకు వసతి కల్పిస్తామని సేవాసదనం పి.డి శేషకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు నిరాశ్రయ మహిళలకు, వారి 5సంవత్సరాల లోపు పిల్లలకు వసతి ఏర్పాటు చేస్తామన్నారు.

# నెల్లూరొస్తున్న కంచి స్వాములు





కంచి కామకోటి పీఠాధిపతి సద్గురు జయేంద్ర సరస్వతి, శంకర విజయేంద్రసరస్వతి స్వామీజీలు ఈ నెల 11 నుండి 14వ తేదీ వరకు నెల్లూరులో విడిది చేస్తారు. 10వ తేదీ రాత్రికే వాళ్లు నెల్లూరు చేరుకుంటారు. మూలాపేటలోని శంకరమఠంలో బస చేస్తారు. వారితో పాటు ఎంతో విశిష్టమైన పీఠాన్ని కూడా తీసుకువస్తున్నారు. శ్రీకంచి కామాక్షి చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయం వద్ద కంచి స్వాముల పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నాలుగురోజుల పాటు కంచిపీఠం సంప్రదాయాల ప్రకారం విశేషపూజలు, చండీహోమం, పీఠానికి అభిషేకాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ స్వామీజీల ప్రవచనాలుంటాయి.

# క్యాన్సర్ హాస్పిటల్‌కు 5లక్షల విరాళం



నెల్లూరు పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌కి హైదరాబాద్‌కు చెందిన వసుధ ఫార్మాకెమ్ లిమిటెడ్ వారు రూ.5లక్షలు విరాళాన్ని గత నెల 25న అందజేశారు. కంపెనీ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మంతెన వెంకటరామరాజు క్యాన్సర్ హాస్పిటల్‌కు వచ్చి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంతెన మాట్లాడుతూ క్యాన్సర్ హాస్పిటల్ నిర్వహణ ఎంతో కష్టసాధ్యమైందని, రెడ్‌క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్ నెల్లూరు వారు పేద క్యాన్సర్ రోగులకు అందిస్తున్న సేవలకు సంతృప్తి చెంది ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. హాస్పిటల్ అభివృద్ధికి ఈ విరాళాన్ని ఉపయోగించాలని కోరారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరు జిల్లా శాఖ ఛైర్మెన్ డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం, రెడ్‌క్రాస్ గాంధీ ఆశ్రమం కన్వీనర్ జి.కృష్ణారెడ్డి, మహావీర్ జైన్ ఛారిటబుల్ ట్రస్ట్ సెక్రటరి జె.పి.జైన్, క్యాన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ టి.లక్ష్మి, క్యాన్సర్ హాస్పిటల్ సబ్‌కమిటి సభ్యులు జి.కన్యాకుమారి పాల్గొన్నారు.

# మంత్రి వల్లే మెడికల్ సీట్లకు గండి

**- ఎమ్మెల్యే అనిల్ విమర్శ**



రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వైఖరి వల్లనే వచ్చే ఏడాది నుంచి నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాల సీట్లు 150 తగ్గబోతున్నాయని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ విమర్శించారు. బుధవారం నెల్లూరు నగరంలోని రాజన్నభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, మెడికల్ కాలేజీలో మౌళిక సదుపాయాలు, సిబ్బంది, లైబ్రరీ తదితర 25 రకాల వసతులు లేవని చెప్పి 150సీట్లను ప్రభుత్వం కుదించబోతోందని, దీనికి కారణం మంత్రి నారాయణ వైఖరేనని ఆరోపించారు. మంత్రి నారాయణకు సొంత మెడికల్ కాలేజీ, వైద్యశాల వున్నందున వాటిని రక్షించుకోవడానికి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వసతులు కల్పించకుండా ఆ కళాశాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలను సర్వనాశనం చేసిన ఘనత నారాయణకే దక్కుతుందని ఆయన విమర్శించారు. మంత్రి ఏనాడైనా ఆ కళాశాలను తనిఖీ చేశారా? వసతుల గురించి ఆరా తీశారా? అని అంటూ, 150 సీట్లు తగ్గబోయే కళాశాలకు వైద్య విద్య అభివృద్ధి కమిటీ ఛైర్మెన్‌ను నియమించిన ఘనత మంత్రి నారాయణదేనని విమర్శించారు. నగర కార్పొరేషన్ కూడా ఇదే విధంగా దుస్థితిలో వుందని ఆయన దుయ్యబట్టారు. కార్పొరేషన్‌లో పారిశుద్ధ్యం పేరుతో, పండుగల పేరుతో కోట్లాదిరూపాయల నిధుల దోపిడీ జరుగుతోందని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. నగరంలో దోమలు రాజ్యం చేస్తున్నా, నగరం మురుగుదిబ్బగా మారిపోతున్నా వారికి పట్టడం లేదని, కమిషనర్ల బదిలీల్లో మాత్రం ఉత్సాహం చూపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దేవరకొండ అశోక్, వైఎస్సార్సీపి నాయకులు కుంచాల శ్రీనివాసులు, గంధం సుధీర్‌బాబు, శ్రీహరి రాయలు, హంజాహుస్సేని పాల్గొన్నారు.

# తెల్లకార్డుదారులకు రుణాలు

నెల్లూరుజిల్లాలోని తెల్లరేషన్ కార్డుదారులకు రూ.10వేలు రుణం మంజూరు చేయనున్నామని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్‌కార్డు దారులకు రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం రూ.2కోట్లను కేటాయించిందని, ఒక్కొక్క కార్డుదారుడికి రూ.10వేల రుణం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్డుదారులు దరఖాస్తులను విఆర్‌ఓ ద్వారా తహశీల్దార్లకు అందజేయాలన్నారు. లబ్దిదారులు తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతానెంబరు, బ్రాంచ్ పేరు, ఐఎఫ్‌సి కోడ్ తదితర వివరాలు దరఖాస్తుతో పాటు అందజేయాలని కోరారు. కమిటి దరఖాస్తులను పరిశీలించి లబ్దిదారులను ఎంపిక చేస్తుందని, ఎంపికైన లబ్దిదారుడి నుంచి అండర్ టేకింగ్ తీసుకుని రూ.10వేలు రుణం అందజేస్తారన్నారు. లబ్దిదారులు తీసుకున్న రుణం 6నెలల్లో 5 వాయిదాల్లో చెల్లించాలని తెలిపారు.

## నెల్లూరులో...

# భద్రతనిచ్చే 'బౌన్సర్స్'

- **వీరికి లాఠీలు, తుపాకీలతో పని లేదు**
- **అంకితభావం, ఆత్మస్థైర్యమే వీరి ఆయుధాలు**



*"బౌన్సర్స్". బహుశా ఈ పదం నెల్లూరీయులకు కొంచెం కొత్తగా అనిపించొచ్చు. కానీ ముంబై లాంటి మహానగరాలలో ఈ "బౌన్సర్స్" దాదాపు 30 సంవత్సరాలుగా ప్రసిద్ధిచెందారు. అక్కడ మొదలైన ఈ "బౌన్సర్స్" సంప్రదాయం క్రమేణా బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ, పూనె, కలకత్తా వంటి మహానగరాలకు విస్తరించి ఇప్పుడు నెల్లూరులో కూడా ఆవిష్కరించబడింది. వందన్ సారధ్యంలో ఏర్పడిన 'వి బౌన్సర్స్' సంస్థ ఇప్పుడు నెల్లూరులో భద్రతతో పాటు భరోసాని ఇస్తోంది.*

## "బౌన్సర్స్" అంటే...

సహజంగా మన ఇళ్ళల్లో లేదా కార్యాలయాల్లో ఏ శుభకార్యం జరిగినా ఆ కార్యక్రమాలకు అవసరమైన రక్షణని సెక్యూరిటీ సిబ్బంది ద్వారా సమకూర్చుకోవడం ఆనవాయితీ. అయితే సాధారణ రక్షణ సిబ్బందితో పాటు కార్యక్రమానికి హాజరయ్యే ముఖ్యులకు, ప్రముఖులకు రక్షణ కల్పించడానికి వలయంలా ఏర్పడి అనుక్షణం వారిని కాపాడే బృందాన్నే 'బౌన్సర్స్' అంటారు. ఒకప్పుడు నైట్ క్లబ్బుల్లోనూ, బార్ & రెస్టారెంట్స్‌తో పాటు పబ్బుల్లోనూ వుండే "బౌన్సర్స్" ఇప్పుడు పెద్దపెద్ద సినిమా ఫంక్షన్లలోనూ, సినిమావాళ్ళ పెళ్ళిళ్ళలోనూ, బడా రాజకీయ నాయకుల ఇండ్లల్లో శుభకార్యాలలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. "బౌన్సర్స్" వ్యవహారశైలే ప్రత్యేకంగా వుంటుంది. వీరి డ్రెస్సింగ్ విధానం కూడా ప్రత్యేక తరహాలో ఉంటుంది. ఒక్క ఆర్గనైజర్స్ మాట తప్ప వేరెవరి మాటా వినరు. వీరికి అస్సలు మొహమాటమే ఉండదు. "బౌన్సర్స్" సంస్థల నిర్వాహకులు వీరికి ఆ విధంగా శిక్షణ ఇస్తారు. ముఖ్యంగా బౌన్సర్లుగా శిక్షణ పొందిన వాళ్ళు బాడీబిల్డర్లై ఉంటారు. వారిని చూస్తేనే ఎదుటవాళ్ళు తప్పు చేయడానికి సంకోచించే రీతిలో వారి వేషధారణ ఉంటుంది.

## చరిత్ర...

ప్రపంచంలోని అనేక దేశాలు దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితమే ఈ "బౌన్సర్స్" సంప్రదాయాన్ని పరిచయం చేశాయి. తాము నిర్వహించే డాన్సు బార్లలో, సెలూన్లలో, జూద కేంద్రాలలో ఎక్కడా దౌర్జన్యాలు, దాడులు జరగకుండా వీరిని ఉపయోగించుకునేవారు. మొదట్లో వీరిని "డోర్ కీపర్"(ద్వార రక్షకులు)గా సంబోధించినా 1870 సంవత్సరంలో ప్రదర్శించిన ఓ నాటకంలో వీరిని "బౌన్సర్"లుగా సంభోదించడంతో అక్కడ నుండి ఈ పేరు వాడుకలోకి వచ్చింది.

## నెల్లూరులో...

నెల్లూరులో మొట్టమొదటిసారిగా 2015 అక్టోబర్ 3వ తేదీన జరిగిన "స్వచ్ఛ సంగీతం" కార్యక్రమంలో స్థానిక బౌన్సర్లను కార్యక్రమ నిర్వాహకులు పరిచయం చేశారు. అప్పటివరకూ ఎక్కడ ఏ పెద్ద కార్యక్రమం జరిగినా ఈ "బౌన్సర్స్"ను హైదరాబాద్ నుండి పిలిపించేవారు. భారతదేశం గర్వించే నటుడు కమల్‌హాసన్, భారతజాతి కీర్తించే గానగంధర్వుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం, తెలుగు సినిమాకి ఆణిముత్యం లాంటి దర్శక శిఖామణి, కళాతపస్వి కె.విశ్వనాథ్‌తో పాటు కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు పాల్గొన్న ఈ కార్యక్రమంలో "వి బౌన్సర్స్" ఈ ప్రముఖులపైన ఈగ కూడా వాలకుండా క్షణ క్షణం వెన్నంటి వుండిన తీరు చూపరులను ఆకట్టుకుంది. నెల్లూరులో సైతం ఇంతటి సమర్ధవంతమైన "బౌన్సర్స్" సంరక్షణ వుందన్న విషయాన్ని నెల్లూరీయులకు తెలియజెప్పింది. "వి బౌన్సర్స్" 'వి ప్రొటెక్ట్ యు' అన్న పేరుతో సంస్థను స్థాపించి తన సహచర మిత్రులను జతగా చేసుకుని "బౌన్సర్స్" సేవలను నెల్లూరీయులకు అందిస్తున్నాడు సంస్థ నిర్వాహకుడు వందన్. నెల్లూరు జిల్లాలోనే మొట్టమొదటిసారిగా రిజిష్టర్ కాబడిన "బౌన్సర్స్" ఏజన్సీగా ఈ సంస్థను నెలకొల్పాడు. ముఖ్యంగా సినిమా స్టార్లు, క్రీడాకారులు వంటి సెలబ్రిటీస్ వచ్చినప్పుడు వీరి ఉపయోగం చాలా వుంటుంది.

## ప్రభుత్వం కూడా వీరి సేవలను ఉపయోగించుకోవచ్చు...



వందన్

నెల్లూరులో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే రొట్టెల పండుగ, పక్షుల పండుగల వంటి కార్యక్రమాలతో పాటు పలు దేవాలయాల్లో జరిగే బ్రహ్మోత్సవాలు, పండుగ పర్వదినాల సమయాల్లో కూడా ఈ "బౌన్సర్స్" సేవలను ప్రభుత్వం వినియోగించుకోవచ్చు. పోలీసు శాఖతో పాటు వీరిని సమన్వయపరచి వీరి సేవలను కూడా ఈ సందర్భాలలో వాడుకుంటే పోలీసుశాఖపై కొంత వత్తిడి తగ్గుతుంది. పెద్దపెద్ద నగరాల్లో ఇప్పటికే పలు సందర్భాల్లో ప్రభుత్వశాఖలు ఈ బౌన్సర్ల సేవలను వాడుకుంటున్నారు. వీరికి లాఠీలు, తుపాకులు అవసరం లేదు. వీరి దేహదారుఢ్యం, అంకితభావం, ఆత్మస్థైర్యమే వీరికి ఆయుధాలు.

ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోయిన నెల్లూరులో 'వి బౌన్సర్స్' వంటి సంస్థల సేవలు చాలా అవసరం. ఎక్కడ ఎవరికి ఎలాంటి రక్షణ సేవలు కావాలన్నా తమ "వి బౌన్సర్స్" సిద్ధంగా వుంటుందని, అవసరమైన వారు 8520018846 నంబరుపై సంప్రదించ వచ్చని అంటున్నాడు వందన్. నెల్లూరులో ఒక మంచి సురక్షిత సాంప్రదాయానికి శ్రీకారం చుట్టిన "వి బౌన్సర్స్"కి 'లాయర్' అభినందనలు.

## 'ప్రభా'తం

# ఆగని దురాగతాలు

**సర్జికల్ దాడుల తర్వాత కూడా పాక్ రెచ్చిపోతుండడం, ఉగ్రవాదులను పదేపదే భారత్‌పైకి ఉసికొల్పుతుండడం ఇంకా మానలేదు. జమ్మూలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఒకేసారి రెండుచోట్ల భారీ దాడులకు తెగబడడం దారుణం..ఘోరం. ఈ ఘటనల్లో ఏడుగురు సైనికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈ ఘటనల్తో భారత్ మరింత అప్రమత్తం కావాల్సివుంది. ఉగ్రవాదులను మట్టుబెట్టిన మన సైనికుల సాహసం గర్వకారణం. ఈ ఘటనల్లో అసువులు బాసిన వీరజవాన్లకు జోహార్లు.**

సరిహద్దుల్లో ఉగ్రవాదులు మరోసారి విరుచుకుపడ్డారు. జమ్మూలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఒకేసారి భారీ దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనల్లో ఒక మేజర్‌తో సహా, ఏడుగురు సైనిక సిబ్బంది అమరులయ్యారు. బిఎస్ఎఫ్ డిఐజితో పాటు మరో 8 మంది భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ రెండు ఘటనలకు పాల్పడిన ఆరుగురు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టింది. పాకిస్తాన్ కొత్త ఆర్మీ చీఫ్‌గా బజ్వా బాధ్యతలు స్వీకరించిన రోజే ఈ దాడులు జరగడం గమనార్హం. యూరీ ఘటనతో భారత్ సర్జికల్ దాడులు జరపడంతో పాక్‌లో కలవరం పుడుతోంది. ఉగ్రవాదులను ఉసిగొల్పి భారత భూభాగంలోకి పంపడం, భారత్‌లో భీభత్సాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు భారత్‌లో తాజాగా మరో రెండు ఘటనలకు పాల్పడ్డారు. రాత్రివేళల్లో ఉగ్రవాద ముష్కరులు భారత్‌లోకి జొరబడడం, గ్రెనేడ్లు విసురుతూ, తూటాలు పేలుస్తూ విచక్షణా రహితంగా భారత సైనిక శిబిరాలపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటీవల యూరీలో వున్న ఆర్మీ ప్రధాన కార్యాలయంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడడంతో ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించడంతో పాక్‌లో కలవరం రేకెత్తింది. దీంతో పాక్ ఎప్పటికప్పుడు సరిహద్దుల్లో ఉద్రిక్తతలను రేకెత్తిస్తూ అవకాశం కోసం పొంచి చూస్తూనే వుంది. రాత్రి వేళల్లో.. విపరీతంగా మంచుకురుస్తున్న సమయం చూసి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఇదే అదనుగా భారత భూభాగంలోకి సైగ్గా దూసుకువచ్చి భారత సైనికులపై ఎడాపెడా కాల్పులకు, దాడులకు పాల్పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలు ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు సమాయత్తం కావాలని భారత ప్రధాని మోడీ ఎంతో సంకల్పదీక్షతో ఉగ్రవాద రక్కసిని సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేస్తుండడమే కాక, ఉగ్రవాదానికి ఊతమిచ్చే నకిలీనోట్లకు తెరదించుతూ, ఉగ్రవాదానికి శాశ్వత ప్రాతిపదికన అడ్డుకట్ట వేస్తూ నల్లధనాన్ని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు కనీవినీ ఎరుగనివిధంగా అత్యంత సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ దశలో పాక్ తన కుయుక్తులను ప్రదర్శిస్తూనే వుంది. ఉగ్రవాదులను భారత భూభాగంలోకి పంపి భీభత్సాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తూనే వుందనడానికి తాజా ఘటనలే ఒక ఉదాహరణ. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువన ఉగ్రవాదులు జమ్ము-కశ్మీర్‌లోని రెండు ప్రాంతాల్లో జొరబడి సైనికకేంద్రాలపై దాడులకు పాల్పడడం, జమ్ములో పోలీసు దుస్తుల్లో ఆర్మీ యూనిట్‌లోకి ప్రవేశించిన ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి దాడులు చేయడం దారుణం. తొలుత ఉగ్రవాదులు మంగళవారం వేకువన పోలీసు దుస్తులతో భారత్‌లోకి జొరబడేందుకు ప్రయత్నిం చారు. సరిహద్దుల్లోని సాంబ్రా, నగ్రోటా ప్రాంతాల మీదుగా ఉగ్రవాదులు వస్తూ భారత ఆర్మీక్యాంప్‌పై కాల్పులకు తెగబడ్డారు. జమ్మూ నుంచి సుమారు పదిహేను కిలోమీటర్ల దూరంలో వున్న నగ్రోటా ప్రాంతం గుండా భారత సరిహద్దు భూభాగంలోకి ఉగ్రవాదులు ప్రవేశించి ఆర్మీక్యాంప్ వద్ద వున్న సైనికులపై కాల్పులు జరపడంతో సైనికులు ఉగ్రవాదులను ధీటుగా ఎదుర్కొని ఆ ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. అయితే, ఈ ఘటనలో ఒక మేజర్ సహా ఏడుగురు సైనికులు తమ ప్రాణాలను కోల్పోవడం ఎంతో బాధాకరం. సాయుధ ఉగ్రవాదులు మొదట నగ్రోటాలోని ఆర్మీ ఆర్టిలరీ విభాగంలోకి దూసుకువచ్చి, అక్కడున్న రెండు నివాసభవనాల్లోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. ఈ దశలో అక్కడున్న అధికారులను, ఇద్దరు మహిళలను, ఇద్దరు చంటిబిడ్డలను బందీలుగా పట్టుకునేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించారు. అయితే, మన సైనికాధికారుల సతీమణులు వెంటనే అప్రమత్తమై ఆ ఉగ్రవాద ముష్కరులను తమ ఇళ్ళలోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. క్వార్టర్స్‌లో వున్న ఇళ్లలోకి ఉగ్రవాదులు జొరబడకుండా ప్రవేశద్వారం వద్ద ఇంట్లో వున్న వస్తువులన్నిటినీ అడ్డుపెట్టి వారు లోపలకు రాకుండా కట్టుదిట్టం చేశారు. ఎంతో ధైర్యసాహసాలతో ఉగ్రవాదులను నిలువరించి ఆ సైనికాధికారుల సతీమణులు వీరపత్నులనిపించుకున్నారు. లేకుంటే ఉగ్రవాదులు అక్కడున్న సైనికాధికారులను, వారి కుటుంబసభ్యులను కూడా బందీలుగా పట్టుకుని మరింత నష్టం కలిగించి వుండే వారు. అయితే, వారి పాచిక పారలేదు. ఈలోగానే సైన్యం అక్కడకు చేరుకుని ఆ ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఇదే సమయంలో రామ్‌గఢ్ సెక్టార్‌లో జరిగిన మరో ఘటనలో మరో ముగ్గురు ఉగ్రవాదులు సరిహద్దుల్లోని సాంబా- చామ్లియాల్ ప్రాంతం వద్ద చొరబాటుకు ప్రయత్నించారు. అక్కడున్న బిఎస్ఎఫ్ క్యాంప్‌పై దాడికి పాల్పడడంతో, సైన్యం వెంటనే రంగంలోకి దిగి ఉగ్రవాదులను ఎదుర్కొంది. కొన్ని గంటలపాటు జరిగిన ఈ భీకర పోరులో చొరబాటుకు ప్రయత్నించిన ఆ ముగ్గురు ఉగ్రవాదులను సైన్యం హతమార్చడం భారత సైనికుల సాహసానికి నిదర్శనం. అయితే, ఈ ఘటనలో ఒక డిఐజితో పాటు మరో సైనిక అధికారి, పలువురు భద్రతా సిబ్బంది తీవ్ర గాయాలపాలు కావడం బాధాకరం. ఈ రెండు వరుస దాడులతో జమ్మూ-శ్రీనగర్ సరిహద్దు ప్రాంతాలు ఉద్రిక్తంగా మారాయి.

సర్జికల్ దాడుల తర్వాత కూడా పాక్ రెచ్చిపోతుండడం, ఉగ్రవాదులను పదేపదే భారత్‌పైకి ఉసికొల్పుతుండడం ఇంకా మానలేదు. దాడులు, భీభత్సాలతో భారత్‌ను కల్లోలం చేయాలనే కుట్రలతో ఉగ్రవాదులు దాష్టీకాలకు పాల్పడుతూనే వున్నారు. కాల్పుల విరమణను పదేపదే ఉల్లంఘించి పాక్ దురాగతాలకు పాల్పడుతూనే వుంది. పాక్ కుయుక్తులు, పేట్రేగిపోతున్న ఉగ్రవాదుల దాడులు అన్నీ ప్రపంచానికి క్రమేణా అర్థమవుతూనే వున్నాయి. పర్యవసానం ఎలా ఉంటుందో మరి.. వేచి చూడాల్సిందే!

ఏదేమైనా... ఈ ఘటనలతో భారత్‌కు మరింత అప్రమత్తత అవసరం. ఈ సందర్భంగా ఉగ్రవాద ముష్కరమూకలను ధైర్యంగా ఎదిరించి మట్టుబెట్టిన మన సైనికుల సాహసం మనందరికీ..మన జాతికే గర్వకారణం. ఉగ్రవాదుల దాడులను ఎదుర్కొంటూ అసువులు బాసిన భారత వీర జవాన్లకు..జోహార్లు!..

## కన్నులపండువగా శ్రీనివాస కళ్యాణం

నెల్లూరులోని శ్రీ వాసవి మాతా ఆర్యవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్థానిక వేదాయపాలెంలోని అయ్యప్పగుడి వద్ద వున్న రాధాకృష్ణ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కళ్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. టిటిడి వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణోత్సవంలో ఆర్యవైశ్యులు అనేకమంది కుటుంబసమేతంగా విచ్చేసి అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివార్లను దర్శించుకుని తరించారు. సింహపురి గోవిందమాల కమిటీ వారిచే నిర్వహించిన ప్రత్యేక పూజల్లో స్వామివార్లకు తిరుమంజనం, శ్రీ వాసవీమాత పూజోత్సవాలు ఘనంగా జరిగాయి. సేవా సంఘం అధ్యక్షులు నూకల పుల్లయ్య, ఉపాధ్యక్షులు జక్కా రమణయ్య, కార్యదర్శి శేగు రమేష్, కోశాధికారి జనార్ధన్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్వామివారి కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం




పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 26వ తేదీ నెల్లూరురూరల్ బుజబుజ నెల్లూరులోని శ్రీనివాస ఇంగ్లీషు మీడియం స్కూలులో భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా బాలభవన్ డైరెక్టర్ జి.సుభద్రాదేవి పాల్గొని మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగం సభలో ఆమోదించి శాసనంగా రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, కె.మురళీమోహన్‌రాజు, స్కూలు ఉపాధ్యాయుడు ఎన్.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నతమైనది.. భగవద్గీత

భగవద్గీత ఎంతో మహోన్నతమైనదని, మానవ జీవితాలకు వెలుగుబాట చూపించే మహనీయగ్రంథం భగవద్గీత అని, సాక్షాత్తూ శ్రీకృష్ణ పరమాత్మ మానవునికి ఈ గ్రంథం ద్వారా మహోన్నతమార్గాన్ని చూపారని వక్తలు అభివర్ణించారు.

ఆదివారం నెల్లూరులోని గుండా ఆంజనేయులు కళ్యాణమండపంలో జరిగిన భగవద్గీత పోటీల ప్రారంభ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని భగవద్గీత విశిష్టతను వివరించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఎల్‌కెజి నుంచి వయోజనుల స్థాయి వరకు వివిధ విభాగాల్లో భగవద్గీత ప్రఖండస్థాయి కంఠస్థ పోటీల్లో నిర్వహించారు. భగవద్గీతలోని జ్ఞానయోగం, కర్మయోగం, సన్యాసియోగం అధ్యాయాల్లో సాగిన ఈ పోటీల్లో పోటీల నిర్వాహక ఇన్‌ఛార్జి బయ్యా శ్రీనివాసులుగుప్తా, గుండా ఆంజనేయులు, మెంటా రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొని జ్యోతిప్రకాశనం చేసి పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో చిన్నారులు, వయోజనులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సత్యసాయి ధ్యానయోగ మండలి సభ్యుడు, స్టేట్‌బ్యాంక్ అధికారి నజీర్ బాషాను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ముఖ్యసభ్యులు మిద్దె శ్రీనివాసులు, అనుమాలశెట్టి హరినారాయణ, ఇవిఎస్ జగదీశ్వర్, బైసాని విశ్వనాథ్, జయకుమార్‌తో పాటు, భజరంగదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## కష్టమైనా భరిద్దాం!

పెద్దనోట్ల రద్దును చాలామంది వ్యతిరేకిస్తున్నారు. అయితే దీనిని అంతగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. మనం ఆ దేశాలు అలా అభివృద్ధి చెందాయి, ఈ దేశాలు ఇలా అభివృద్ధి చెందాయని చదువుకుంటుంటాం. మన దేశం గురించి కూడా ఇతర దేశాల్లో వున్నోళ్లు అలా చదువుకోవాలి. కష్టం లేకుండా ఫలితం రాదు. ఈ 50రోజుల కష్టాన్ని అధిగమించడం పెద్ద సమస్య కాదు. మన దేశానికి నల్లధనం, అవినీతి, నకిలీ కరెన్సీ, తీవ్రవాదం, డబ్బు కోసం జరిగే నేరాలు ప్రధాన సమస్య. పెద్ద నోట్ల రద్దు వల్ల వీటిలో చాలా సమస్యలు పరిష్కారం కావచ్చు. లేదా తగ్గవచ్చు. పెద్దనోట్ల రద్దు వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తాత్కాలిక ఇబ్బంది పడతారు. కాని శాశ్వత ప్రయోజనాలుంటాయి. కాబట్టి పెద్దనోట్ల రద్దు విషయంలో ప్రధాని నరేంద్రమోడీకి మనమంతా సహకరించాలి.

**జి. ఈశ్వర్, నెల్లూరు.**

## వీళ్లా... మన ప్రతినిధులు

పెద్దనోట్ల రద్దు తర్వాత జిల్లాకు చెందిన ఓ మంత్రి వందకోట్లకు పైగా నల్లధనాన్ని తీసుకున్నాడని 'లాయర్'లోనే చదివాను. ఇలాంటి ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నట్లు? అసలు ఇలాంటి వాళ్లను మంత్రులను చేయడమేమిటి? నల్లధనం అరికడతామని చెప్పి పెద్దనోట్లు రద్దు చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి ఈ మంత్రిగారి విషయాన్ని చెప్పాలి. నల్లదొంగలు బయట లేరని ఆయా ప్రభుత్వాలలో మంత్రులుగా, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా వున్నారని ఆయన తెలుసుకుంటే మంచిది.


**- వి.సుజాత, నెల్లూరు.**

## విలువలను గౌరవించాలి!

పరిపాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియంతృత్వ పోకడలకు పోతున్నారు. ప్రజలచేత ఎన్నిక కాబడ్డ ఎమ్మెల్యేలను కాదని తమ పార్టీ నాయకుల ద్వారా ప్రభుత్వ నిధులను ఖర్చు చేయించడమేమిటి? అధికారంలో ఏ పార్టీ వున్నా నియోజకవర్గాల అభివృద్ధి పనులు, నిధులపై ఎమ్మెల్యేలే అథారిటీ! చంద్రబాబు ఆ స్ఫూర్తిని తుంగలో తొక్కి చెడు సంప్రదాయాలను తీసుకొస్తున్నాడు.

**కె.ఆనందసాగర్, మంగళగిరి.**

# నెల్లూరు జనంపై... దోమల దండయాత్ర





- పడకేసిన పారిశుద్ధ్యం
- కలెక్షన్‌లకే ప్రాధాన్యం
- పనులు పట్టని హెల్త్ ఆఫీసర్
- ప్రజారోగ్యం అస్తవ్యస్థం

*రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఆర్భాటంగా శత్రు దేశాల మీద యుద్ధానికి పోతున్నట్లుగా 'దోమలపై దండయాత్ర' అన్నారు. దీని పేరుతో ఖర్చు కూడా వ్రాసారు. నెల్లూరులో మాత్రం అదికాస్తా రివర్స్‌లో వుంది. ఇక్కడ ప్రజలపై దోమల దండయాత్రలాగా పరిస్థితి ఉంది. నెల్లూరు టౌన్ ముదురుదోమలకు పెట్టింది పేరు. కార్పొరేషన్ పారిశుద్ధ్య సిబ్బంది బాగా పని చేస్తున్నారు, ఫాగింగ్ చేస్తున్నారు, మురికి కాలువలను శుభ్రం చేస్తున్నారు, మురికి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్నారంటేనే నెల్లూరులో దోమలు జనాన్ని పీకి పాకాన పెడుతుంటాయి. అలాంటిది ఈ పనులన్నీ చేయకుంటే... దోమలు ప్రజల రక్తాన్ని స్ట్రా వేసుకుని పీల్చేయవు.*

ప్రస్తుతం నెల్లూరులో అదే జరుగుతోంది. నెల్లూరు నిండా దోమలు విజృంభిస్తున్నాయి. ఇళ్లల్లో జనాలు దోమలు చంపుకునే పనిలో నిమగ్నమవుతున్నారు. దోమలను నిర్మూలించాల్సిన నెల్లూరు నగరపాలక సంస్థ హెల్త్ విభాగం వాళ్ల మాత్రం పారిశుద్ధ్యం పనులను పక్కన పెట్టేసి చోద్యం చూస్తున్నారు. నెల్లూరులో పారిశుద్ధ్యం పనులు పరమ అధ్వాన్నంగా ఉంటున్నాయి. ఎక్కడ చెత్త దిబ్బలు అక్కడే... ఎక్కడి పందుల గుంపులు అక్కడే! ఎక్కడా ఫాగింగ్ లేదు. మురికి కాలువల్లో సిల్ట్ తీయడం లేదు. ఇటీవల కాలంలో పారిశుద్ధ్య సిబ్బంది సమ్మెకు దిగారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగానే కార్మికులు సమ్మెకు దిగడం, నగర పౌరులు వారం రోజులపాటు మురికిలో మగ్గిపోవడం జరిగింది.

అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన హెల్త్ ఆఫీసర్ మూలంగానే నగరం మురికి కూపంగా మారుతోంది. ఏసిబికి పట్టుబడ్డా కూడా ఈ హెల్త్ ఆఫీసర్‌ను మేయర్ తిరిగి రప్పించుకున్నాడు. హెల్త్ విభాగానికి సంబంధించి కలెక్షన్‌ల పనులు అతనికి అప్పగించాడు. దీంతో పనులు చేయకుండానే బ్లీచింగ్ చల్లకుండానే, కాలువల్లో సిల్ట్ తీయకుండానే బిల్లులు పెట్టడం... 50మంది పారిశుద్ధ్య కార్మికులుంటే వంద మందికి బిల్లులు పెట్టడం... హెల్త్ విభాగంలో అవినీతి మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. నెల్లూరులో హెల్త్ ఆఫీసర్ పదవీకాలం ముగిసినా తన కలెక్షన్‌లు ఎక్కడ పోతాయోనని చెప్పి మేయర్ అతనిని వదలడం లేదు. ఇతను హెల్త్ ఆఫీసర్‌గా వచ్చాక నాలుగుసార్లు పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగారు. రాజకీయ కక్షలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేశారు. చివరకు లాటరీ ద్వారా బదిలీలు చేసే పరిస్థితిని తీసుకొచ్చారంటే ఎంత సిగ్గు చేటైన విషయం.

నగరంలో పారిశుద్ధ్య పనులనేవి పెద్దగా జరగడం లేదు. కాని పారిశుద్ధ్యం పేరుతో దిగమింగేది మాత్రం గతం కంటే ఘనంగా పెరిగింది. పాలకులు ప్రజల సొమ్మును, నెల్లూరు దోమలు ప్రజల రక్తాన్ని పోటీపడి పీల్చేస్తున్నారు.



## సంస్కృతి మారలేదు... కమిషనర్ ట్రాన్స్‌ఫర్

- కొత్త కమిషనర్‌గా హరీష్



*అదే సాంప్రదాయం... అదే పద్ధతి... అదే సంస్కృతి... నెల్లూరు నగర పాలక సంస్థకు కొత్త కమిషనర్‌ను వేశారు. ఇక్కడ ఏ కమిషనర్ అయినా ఏడాదికిమించి ఉండకూడదు. ఇది ప్రభుత్వ చట్టాలలో ఉన్న నిబంధన కాదు. నెల్లూరు నగరపాలకులు ఆచరణలో అమలు చేస్తున్న అనధికారిక చట్టం. ఎట్టకేలకు నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు కూడా బదిలీ అయ్యారు.*

ఆయన బదిలీ కానున్నారనే విషయం ఇటీవల 'లాయర్' వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన నెల్లూరు కమిషనర్‌గా వచ్చిన ఆయన 9నెలలు నిండకుండానే బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చీఫ్‌కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సిసిఎల్‌ఏ)లో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న హరీష్‌ను డిప్యూటేషన్ మీద బదిలీ చేశారు.

నెల్లూరు నగరపాలక సంస్థకు సంబంధించి గత 20ఏళ్ల చరిత్రను తీసుకుంటే ఏడాదికి మించి ఇక్కడ కమిషనర్‌లుగా పనిచేసిన వాళ్లను వేళ్ల మీద లెక్కెట్టవచ్చు. ఒక్క టి.ఎస్.ఆర్.ఆంజనేయులు మాత్రం ఐదేళ్లకుపైగా పనిచేశాడు. ఆయనను ఈ లెక్కన చూస్తే గిన్నీస్ రికార్డ్స్‌లోకి ఎక్కించవచ్చు.

ఈ విషయం పక్కనపెడితే 2014లో అబ్దుల్ అజీజ్ మేయర్‌గా కొత్త పాలకవర్గం ఏర్పడడం తెలిసిందే! కొత్త పాలకవర్గం పదవీకాలాన్ని ఇప్పటికి రెండున్నరేళ్లు పూర్తి చేసుకోగా, ఈ సగం కాలంలో నగరపాలక సంస్థకు నలుగురు కమిషనర్లు మారిపోయి ఐదో కమిషనర్ వచ్చాడు. కొత్త పాలకవర్గం వచ్చేనాటికి జాన్ శ్యాంసన్ కమిషనర్‌గా వున్నాడు. నెల్లూరుకు ఐఏఎస్‌ను కమిషనర్‌గా వేయాలని చెప్పి ఆయనను పంపించి ఐపిఎస్ కమ్ ఐఏఎస్ అయిన చక్రధర్ బాబును తెచ్చారు. వివిధ రాజకీయ కారణాలతో ఆయనను సాగనంపారు. ఆ తర్వాత పివివిఎస్ మూర్తిని తీసుకొచ్చారు. మేయర్ చెప్పిన పనులను చేయడం లేదని చెప్పి నారాయణ మీద ఒత్తిడి తీసుకువచ్చి ఆయన్ను కూడా 8 నెలలకే బదిలీ చేశారు. ఈసారి వెంకటేశ్వర్లును మేయర్ అజీజ్ ఏరికోరి తెచ్చుకున్నాడు. ఆయన ఆధ్వర్యంలోనే కలెక్షన్‌ల పర్వం నడిపించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏసిబి దాడులు కూడా జరిగాయి. ఇటీవల కమిషనర్ వెంకటేశ్వర్లు వైఖరిపై మంత్రి నారాయణ కూడా సీరియస్‌గా వున్నాడు. అలాగే మేయర్‌కు కూడా ఇటీవల పొసగడం లేదు. ఇంతేకాకుండా వెంకటేశ్వర్లు కూడా ఈ తలనొప్పంతా నాకెందుకు, ఇక్కడ నుండి తొందరగా బయటపడితే బాగుండుననే మూడ్‌లోకి వెళ్లాడు. ఇలా అందరి ఆలోచన ప్రకారమే వెంకటేశ్వర్లు బదిలీ జరిగింది. ఇక కొత్త కమిషనర్ హరీష్ వైయస్సార్ జిల్లా వాడు. 20ఏళ్ల నుండి హైదరాబాద్‌లోనే ఆర్డీవోగా, రంగారెడ్డిజిల్లా 'లా' అధికారిగా, సర్వీసెస్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా పని చేసున్నాడు. తొలిసారి హైదరాబాద్‌ను వదిలి నెల్లూరులో పడ్డాడు. ఇక్కడి నాయకుల ఒత్తిడిని ఏ మాత్రం తట్టుకుంటాడో చూడాలి.

### మంత్రులకు పట్టదా?

నగరాల అభివృద్ధికి సంబంధించి కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రులుగా వున్నోళ్లిద్దరూ నెల్లూరోళ్లే! కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిగా వెంకయ్యనాయుడు, రాష్ట్ర మున్సిపల్ మంత్రిగా నారాయణ వున్నారు. నగరంలో ఎన్నో సమస్యలు... ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ అవినీతిమయమైపోయింది. పాలకులకు కలెక్షన్‌లు తప్ప ఇంకేమీ పట్టడం లేదు. ఏడాదికోసారి కూడా కౌన్సిల్ సమావేశాలు జరుపుకోలేని దుస్థితి ఏర్పడింది. ఈ కార్పొరేషన్‌ను గాడిలో పెట్టడానికి కనీసం ఒక సమర్ధుడైన కమిషనర్‌ను తేలేకపోతున్నారు. గతంలో చక్రధర్‌బాబు గట్టిగా పనిచేస్తుంటే పొగ పెట్టి పంపారు. ఇప్పుడున్నా ఒక మంచి అధికారిని కమిషనర్‌గా వేసుంటే బాగుండేది. కాని మంత్రులిద్దరికీ గట్టి కమిషనర్‌ను నియమించడంపై ఆసక్తే లేనట్లుంది.

## వ్యాపారంపై భక్తి... పార్టీపై నిరాసక్తి

- మేయర్ తీరుపై తెలుగు నేతల కినుక



*ఆయన గుండెల్లో ఎన్టీఆర్ ఉండడు... ఆయన మనసులో చంద్రబాబు కొలువై ఉండడు... ఆయన బ్లడ్‌లో తెలుగుదేశం ఉండదు... నిన్న ఒక పార్టీ... నేడొక పార్టీ... రేపు ఏ పార్టీయో తెలియదు. వ్యాపారంలో ఉండేవారికి ఏ పార్టీ అయినా ఒకటే! రాజకీయమే వ్యాపారమనుకున్న వాళ్లకు ఏ పార్టీ జెండా అయినా ఒక్కటే! నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ ఇందుకు అతీతుడు కాదు. అంతెందుకు తెలుగుదేశం పార్టీలో వున్న నాయకులలో సగం మందికిపైగానే ఇది వర్తిస్తుంది.*

పార్టీ పట్ల భక్తి, పార్టీ అధినేత పట్ల అభిమానం అన్నవి ఎప్పుడో కొట్టుకు పోయాయి. ఇప్పుడున్నదంతా కూడా అవసరాన్ని బట్టి పార్టీని మార్చడం, అవకాశాన్ని బట్టి పార్టీ అధినేతల్ని అభిమానించడం. నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ వైసిపి నుండి ఎన్నికై తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! అయితే ఆయన వైకాపా నాయకులకు ఎంత దూరంగా ఉంటున్నాడో తెలుగుదేశం నాయకులతో కూడా అంతే దూరం పాటిస్తున్నాడు. జిల్లాలోని తెలుగుదేశం ముఖ్య నాయకులందరితోనూ ఆయనకు పేచీలున్నాయి. ఆనంతో పడదు, సోమిరెడ్డితో సఖ్యత లేదు, ఆదాలతో అప్పుడప్పుడూ అడ్జస్ట్‌మెంట్! పార్టీలోకి తీసుకొచ్చిన మంత్రితోనూ మధ్యలో వివాదాలే!

మేయర్ తీరుపై ఇప్పుడు పార్టీలోనూ విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా మేయర్ పదవి రెండు అసెంబ్లీ నియోజక వర్గాలను ప్రభావితం చేసేది. రెండు నియోజకవర్గాల్లో పార్టీ కేడర్‌కు ఆక్సిజన్ అందించే పదవి ఇది. ఇలాంటి పదవి తెలుగుదేశంపార్టీకి ఎందుకూ ఉపయోగ పడడం లేదు. మేయర్ పదవి ద్వారా అజీజ్ పార్టీ కేడర్‌కు గాని ప్రజలకు గాని ఏ పనీ చేయడం లేదు. సరికదా, ఆయన తెలుగుదేశంపార్టీ మేయర్ అన్న ముద్ర పడడంతో ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత అంతా కూడా పార్టీపై ప్రభావం చూపే అవకాశముంది. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగుదేశం ముసుగు ఆయన అవినీతి, అక్రమాలకు ఉపయోగపడు తుందేగాని, ఆయన వల్ల పార్టీకి ఎలాంటి ఉపయోగం లేదని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి.

నెల్లూరు నగరంలో 25డివిజన్ల సభ్యత్వాల బాధ్యతలను ఆయన తీసుకోవడం జరిగింది. డివిజన్‌కు 1500 సభ్యత్వాలు లెక్కన మొత్తం 25డివిజన్‌లకు కలిపి 37,500 సభ్యత్వాలు నమోదు చేయించాలి. ఆ పనిని ఆయన సక్రమంగా పూర్తి చేయలేదు. డివిజన్‌కు వంద, నూటయాభై లెక్కన చేయించాడు. ఇటీవల నెల్లూరుకు లోకేష్ వచ్చే ముందురోజు మాత్రం ఓటర్ల లిస్టులు దగ్గరేసుకుని అదరాబదరా సభ్యత్వాలు రాయించినట్లు సమాచారం. పాతిక డివిజన్‌లలో సభ్యత్వాలను నేనే చేయిస్తానని చెప్పిన మేయర్ తీరా బాధ్యతలను కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జ్‌లకు అప్పగించి చేతులు దులుపుకోవాలని చూసాడు. అయితే కార్పొరేటర్లు దీనికి నిరాకరించినట్లు సమాచారం. బిల్డప్ నీది... బాధ్యత మాదా... అని అడ్డం తిరిగారని తెలుస్తోంది. మేయర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదులు తక్కువ ఉండడం, ఆయన నేతృత్వంలో జనచైతన్య యాత్రలు సైతం సరిగా జరగకపోతుండడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిచంద్ర ఆయనపై ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే మిగతా టీడీపీ శ్రేణులు కూడా మేయర్ వైఖరిపై అసంతృప్తితో ఉన్నాయి.

# నెల్లూరు కబుర్లు

## కొత్త నెల... పాత కష్టాలు

డిసెంబర్ వచ్చింది. 2016 సంవత్సరానికి చివరి నెల. పెద్దనోట్ల రద్దుతో 22 రోజులుగా కష్టాలు పడుతున్న జనానికి కొత్త నెలలో మరికొన్ని సమస్యలు ఎదురుకాబోతున్నాయి. 1వ తేదీ వచ్చిందంటే చెల్లింపులన్నీ కూడా నగదు రూపంలోనే వుంటాయి. ఇంటి అద్దె, మెయింటెనెన్స్, కరెంట్ బిల్లు, ఫోన్ బిల్లు, పాలబిల్లు, డిష్ బిల్లు, ప్రొవిజన్ షాపులో పాత బాకీ, కొత్తగా తెచ్చుకోవాల్సిన సరుకులు... వీటన్నింటికీ కరెన్సీతోనే పని. కాని, నెలసరి జీతాలు మాత్రం చెక్కుల రూపంలోనో, లేకుంటే నేరుగా ఉద్యోగుల ఖాతాలకు జమ చేయడమో జరుగుతుంది. ఇంటి అద్దెకు, పాలవాడికి, డిష్‌కు చెక్కులివ్వలేము. కార్డు స్వైపింగ్ చేయలేము. అకౌంట్‌లో పడ్డ జీతాన్ని పూర్తిగా విత్‌డ్రా చేసుకునే పరిస్థితి లేదు. జనానికి సినిమా కష్టాలు ఎలా ఉంటాయో తెలిసొస్తోంది.

### నూతన సంవత్సరంపై...

## నోట్ల రద్దు ప్రభావం!

డిసెంబర్ నెల అంటేనే ఒక రకమైన పండుగల సీజన్! ఈ నెల 25వ తేదీన క్రిస్టమస్, జనవరి 1వ తేదీ 2017 నూతన సంవత్సరం... ఇక జనవరి 13, 14, 15తేదీలలో తెలుగు ప్రజలకు అతి ముఖ్యమైన భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు. అయితే ఈసారి ఈ పండుగలేవీ కూడా సంతోషంగా, సరదాగా జరుపుకునే పరిస్థితులు కనిపించడం లేదు. పెద్దనోట్ల రద్దు ప్రభావం ప్రధానంగా వీటిపై పడబోతోంది. క్రిస్టమస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంలో పలు వ్యాపారాలు జోరుగా జరగాలి. షాపింగ్‌మాల్స్, మార్కెట్లు కిటకిటలాడుతుండాలి. ముఖ్యంగా వస్త్రాల కొనుగోళ్లకు ఈ నెల ప్రత్యేకసీజన్. బట్టల దుకాణాల వాళ్లు ప్రత్యేక ఆఫర్‌లతో ఖాతాదారులను ఆకర్షిస్తుంటారు. నోట్ల రద్దు వల్ల ప్రజల వద్ద తగినంత నగదు లేకపోవడంతో, మొదట ఇంట్లో జరుగుబాటుకే ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో ఈసారి బట్టల కొనుగోళ్లు తగ్గిపోయాయి. బంగారం కొనుగోళ్లు కూడా పాన్‌కార్డు నిబంధనల వల్ల తగ్గాయి. క్రిస్టమస్ సందర్భంగా స్వీట్స్, బేకరీ బిజినెస్ బాగా జరగాలి. ఈసారి ఈ వ్యాపారాలు కూడా తగ్గబోతున్నాయి.

కొత్త సంవత్సరం అంటే మద్యం అమ్మకాలు పెరగాలి. రెస్టారెంట్‌ల వ్యాపారం జోరుగా వుండాలి. కాని ఇప్పుడు 2016ను ఎంతో భారంగా సాగనంపుతున్నారు. 2017కు కూడా అంతే భారంగా ఆహ్వానం పలకబోతున్నారు. సంక్రాంతి పండక్కి నిత్యావసర సరుకుల వ్యాపారాలు, వస్త్ర వ్యాపారాలు బ్రహ్మాండంగా జరగాలి. 2017 సంక్రాంతి మాత్రం కళాకాంతిని కోల్పోక తప్పదనిపిస్తోంది.

### జాతీయ స్థాయి యోగా పోటీలకు

## వాత్సల్య విద్యార్థులు



గత నెల 26 నుండి 28వ తేదీ వరకు నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో నెల్లూరు కొండాయపాళెం వద్దగల వాత్సల్య హైస్కూలు(భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు) విద్యార్థులు ఎంపికయ్యారు. కె.భువనేశ్వరి (ప్రథమ స్థానం), సి.హెచ్.నితీష్(తృతీయ స్థానం), ఎన్.హారతి, బి.సిషికారాజ్(అయిదవ స్థానం)లో నిలిచి త్వరలో ఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి, స్కూలు కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు, హెడ్మాస్టర్ ఎం.మధుసూదనరెడ్డి, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## మిస్టర్ ఏపిగా నెల్లూరీయుడు



విజయవాడ సమీపంలోని కానూరులో జరిగిన రాష్ట్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో మిస్టర్ ఏపి-2016గా నెల్లూరుకు చెందిన వెంకటేష్ ఛాంపియన్‌షిప్‌ను సాధించాడు. కానూరులో అన్నే రామతులసి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర బాడీబిల్డింగ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 13జిల్లాల నుండి దాదాపు 250మంది బాడీబిల్డర్లు పాల్గొన్నారు. నెల్లూరుకు చెందిన వెంకటేష్ మిస్టర్ ఏపిగా గెలవగా, టీమ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమస్థానంలో కృష్ణ, ద్వితీయ స్థానంలో నెల్లూరు జట్లు నిలిచాయి. గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం బహుమతులు అందజేశారు. ట్రస్ట్ ఛైర్మెన్ అన్నే శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అభినయ ఆర్ట్స్ వార్షికోత్సవం

### ఆకట్టుకున్న నాటికలు

నెల్లూరులోని అభినయ ఆర్ట్స్ అకాడమి అయిదవ వార్షికోత్సవ వేడుకలు నెల్లూరు టౌన్‌హాలులో ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు సినీ, లలిత సంగీతం, శాస్త్రీయ నృత్య పోటీలు, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథులు పాల్గొని మాట్లాడుతూ నాటక ప్రదర్శనలు కనుమరుగవుతున్న తరుణంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం 400 నాటికలు, నాటకాల్లో నటించి, టీవీ సీరియల్స్, చలన చిత్రాల్లో నటిస్తున్న నటుడు గోపరాజు రమణను సంస్థ తరపున అతిథులు ఘనంగా సత్కరించి "చతుర్విధాబినయ స్రష్ట" బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అభినయ ఆర్ట్స్ వారి శృతిలయ నాటిక, విశాఖపట్నం గోవాడ వారి పంపకాలు నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. నటీ నటులు పాత్రోచితంగా నటించి మెప్పించారు. సాంస్కృతిక పోటీలలో



గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిథులు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షులు సిఆర్ రాఘవ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారుడు ఎస్.ఎన్.నరశింహం, ప్రముఖ గుండెవైద్య నిపుణులు డా॥ ఎన్.గురుప్రసాద్, సీనియర్ కళాకారుడు కృష్ణమూర్తి, ఎస్ఆర్‌కె హైస్కూల్ అధినేత కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### 11న తిప్పావఝులకు

## సోమిరెడ్డి జమున స్మారక పురస్కారం

సోమిరెడ్డి జమున స్మారక నానీల పురస్కారం-2016ను ప్రముఖ కవి తిప్పావఝుల సుబ్రహ్మణ్యంకు అందజేస్తున్నట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షకార్యదర్శులు చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11వ తేదీన నెల్లూరులో జరిగే సాహిత్య కార్యక్రమంలో పురస్కారం ప్రదానంతో పాటు డాక్టర్ పెళ్ళకూరు జయప్రద కథా సంపుటిని విడుదల చేస్తామన్నారు.

### 10, 11న

## సాంస్కృతిక పోటీలు

నెల్లూరు కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ శనివారం, 11వ తేదీ ఆదివారం నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా పాటలు, లలిత సంగీతం, శాస్త్రీయ నృత్యాలు, ఏకపాత్ర, చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 10వ తేదీ 'మద్యం, పొగత్రాగుట ఆరోగ్యానికి హానికరం' అంశం మీద, 11వ తేదీ 'ర్యాగింగ్‌ను అరికట్టండి' అంశం మీద సభ జరుగుతుందన్నారు. వివరాలకు 78423 58021 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## ఎమ్మెల్యే సాయంతో దోమల నిర్మూలన



నెల్లూరు నగరంలోని 51వ డివిజన్ కపాడిపాలెంలో నెల్లూరు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్ సొంత నిధులతో చేపట్టిన దోమల నిర్మూలన కోసం మురికి కాలువల్లో స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని స్థానిక వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు అరవ ఆనంద్‌బాబు, ఎ.బాలాప్రసాద్, కాయల సురేష్‌బాబు, ఎ.ఆంథోనిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్స్ ప్రిలిమ్స్‌లో

## శ్రీహర్ష విజయభేరి



పోలీస్ కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ పరీక్షా ఫలితాల్లో నెల్లూరులోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్ విజయభేరి వోగించింది. ఈ కోచింగ్ సెంటర్‌లో మొత్తం 300 మందికి శిక్షణ ఇవ్వగా, అందులో 220 మంది (72 శాతం) మెయిన్స్‌కు అర్హత సాధించారని ఆ కోచింగ్ సెంటర్ గ్రూప్స్ విభాగానికి చెందిన డైరెక్టర్‌లు మాగులూరి హరిబాబు, ఆర్‌టి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల విజయానికి కృషి చేసిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. కాగా, ఈ ఏడాది బ్యాంకింగ్, ఎస్ఎస్‌సి తదితర రంగాల్లో మొత్తం 300ఉద్యోగాలు సాధించామని, తాజాగా కానిస్టేబుల్స్ పరీక్షల ఫలితాల్లోనూ మంచి విజయం లభించిందని వారు సంతోషం వ్యక్తం చేశారు. విశిష్టమైన టెస్ట్‌ల నిర్వహణ పద్ధతి, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే మంచి శిక్షణ ఇప్పించడం వల్ల, విద్యార్థులకు క్రమశిక్షణ, శిక్షణ పట్ల పర్యవేక్షణలతో ఈ అద్భుత విజయాలను సాధించగలిగామని వారు పేర్కొన్నారు.

### అంధుల పాఠశాల చిన్నారులకు

## దుప్పట్ల పంపిణీ



స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి 70వ జయంతి సందర్భంగా గత నెల 26వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో చిన్నారులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో మాజీ నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్ పాల్గొని మాట్లాడుతూ మెట్ట ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి సుబ్బరామిరెడ్డి అని, ఆయన ఆశయాలను మార్గదర్శకంగా తీసుకుని వాటి సాధనకు నేటి యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రమిద శ్రీనివాసులు, సునీత, ఉడతా సుమన్, ప్రసాద్ పాల్గొన్నారు.

## మాటల మంత్రిని కాదు..
# చేతల యంత్రాన్ని...

### జనచైతన్య యాత్రల ముగింపులో నారాయణ



నాకు మాటలు తక్కువ... చేసే పని ఎక్కువ... ఏ పనిలోనైనా నాకు నేనే పోటీ, నాకెవ్వరూ లేరు సాటి అని మున్సిపల్ మంత్రి పి.నారాయణ చెప్పుకున్నారు. మంగళవారం నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి నగరంలో జరిగిన 'జనచైతన్య యాత్ర' ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విఆర్‌సి సెంటర్ నుండి గాంధీబొమ్మ మీదుగా నర్తకి సెంటర్‌లోని ఎన్టీఆర్ బొమ్మ వరకు సాగిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ బొమ్మ వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మంత్రిగా ఈ జిల్లాకు నా అంత పని ఎవరూ చేసి ఉండరన్నారు. కాంగ్రెస్ పాలనలో పదేళ్ల పాటూ సంగం, నెల్లూరు బ్యారేజీలు మూలన పడ్డాయని, వాటిని ట్రాక్ ఎక్కించింది నేనేనని, త్వరలోనే వాటికి ప్రారంభోత్సవం కూడా ఉంటుందని చెప్పారు. నెల్లూరుకు తాగునీళ్లు, భూగర్భ డ్రైనేజీ కోసం 1100కోట్లు నిధులు తెచ్చాం. కార్పొరేషన్‌కు రూపాయి ఖర్చు లేకుండా నగరమంతా ఎల్ఇడి బల్బులు వేయించాం. భారీ వర్షాల సమయంలో నగరం ముంపుకు గురికాకుండా ఉండేందుకు 13కాలువలపై వున్న ఆక్రమణలను తీసేస్తున్నాం. బాధితుల కోసం వెంకటేశ్వరపురంలోని యాష్‌పాండ్ వద్ద 5వేల ఇళ్లు కట్టించబోతున్నామని మంత్రి చెప్పారు. నెల్లూరుజిల్లా సమస్యలపై తనకు అవగాహన లేదని విపక్ష నాయకులు పదేపదే విమర్శలు చేస్తున్నారని, చంద్రబాబు నాయుడు సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులతోనే వారి విమర్శలకు గట్టి జవాబిస్తానని ఆయన పేర్కొన్నారు.

జనచైతన్య యాత్ర ముగింపు కార్యక్రమాన్ని సాంస్కృతిక కార్యక్రమాలతో, కళాబృందాల నృత్యాలతో, తీన్మార్ వాయిద్యాలతో అట్టహాసంగా నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ ఆధ్వర్యంలో రెండున్నరేళ్ల తెలుగుదేశం ప్రభుత్వ విజయాలపై ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నగర పార్టీ ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు నరసింహయాదవ్, మాజీమంత్రి టి.రమేష్ రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, టిడిపి నగర కన్వీనర్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ, పార్టీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, ఆనం జయకుమార్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యు అక్రమాలపై...
# లోకేష్ స్పందన



నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ(విఎస్‌యు) అక్రమాలపై టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ స్పందించి, తమ ఫిర్యాదును ప్రభుత్వ పరిశీలనకు పంపారని జిల్లా ఎస్సీఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు పాముల హరిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విఎస్‌యులో అవినీతి అక్రమాలపై, వర్శిటీలో కొనసాగుతున్న కుల వివక్ష వగైరాలకు సంబంధించి రూపొందించిన బుక్‌లెట్‌ను ఇటీవల నారా లోకేష్‌కు ఇచ్చి, వాటిపై విచారణ జరపాలని కోరామని, ఆ మేరకు ఆ ఫిర్యాదును స్వీకరించిన నారా లోకేష్ దానిని పరిశీలించాలని కార్యాలయ సిబ్బందికి అందజేశారని, ఆ ఫిర్యాదును 39517 నంబర్‌తో నమోదు చేసి ప్రభుత్వానికి పంపినట్లు తమకు సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. విఎస్‌యు అక్రమాల విషయంలో ప్రభుత్వం స్పందించి దానిని ప్రక్షాళన చేస్తుందని తాము ఆశిస్తున్నామన్నారు.

# డిసిసి ఆధ్వర్యంలో 'రాజ్యాంగ దినోత్సవం'



నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత నెల 26న రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు డా. పనబాక కృష్ణయ్య నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నవభారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డా. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ప్రవేశిక స్వరూపమైన 'సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా రూపొందించుకున్న భారతదేశ రాజ్యాంగ ప్రతిజ్ఞను నాయకులు, కార్యకర్తలచేత ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ అంబేద్కర్ 2 సంవత్సరాల, 11నెలల 17రోజుల్లోనే పూర్తిస్థాయి రాజ్యాంగాన్ని రచించి భారతదేశ చరిత్రలో చెరగని ముద్రను వేసుకున్నారని డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య కొనియాడారు. డా. అంబేద్కర్ 125వ జయంత్యుత్సవాల్లో భాగంగా నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. డా. అంబేద్కర్ ఆశయాలను నేటితరం స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సమన్వయ కమిటీ సభ్యులు సివి శేషారెడ్డి, పిసిసి ఎస్‌సి సెల్ రాష్ట్ర కన్వీనర్ శీలం తిరుపతయ్య, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు రావూరు వెంకటరమణయ్య, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు శివాచారి, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సుజాత, డిసిసి ఉపాధ్యక్షులు పత్తి సీతారాంబాబు, పిసిసి అధికార ప్రతినిధి రఘురాం ముదిరాజ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు జి.కేశవనారాయణ, షేక్ అమీనా, ఎన్ఎస్‌యుఐ నగర అధ్యక్షుడు ఎస్‌కె ముమిత్‌షా, జిల్లా ప్రధానకార్యదర్శి అరవ రామమోహన్ రావు, యూత్‌కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సోమ గిరీష్, శ్రీనివాసులు, దార్ల సునీల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్‌మనీకి...
# బాటలు వేసిన బ్యాంకులు



### చిన్నతప్పుతో.. పెద్దనోట్లు మాయం

బ్లాక్‌మనీని అరికట్టాలని చెప్పి ప్రధాని నరేంద్ర మోడీ పెద్దనోట్లు రద్దు చేస్తే అంతకంటే పెద్దనోటైన 2వేల నోట్లు బ్లాక్ మార్కెట్‌లోకి భారీగా వెళ్లిపోయాయి. 2వేల నోట్ల కట్టలపై పెద్దఎత్తున కమిషన్ వ్యాపారం కూడా జరిగింది. ***2వేల నోట్లను దారిమళ్లించడంలో కొందరు బ్యాంకు అధికారులు, పోస్టాఫీసు సిబ్బంది కీలకపాత్ర పోషించారు. లక్షకు 70వేల లెక్కన కమిషన్ వ్యాపారం చేశారు. ప్రజలకు ఇవ్వడానికి పంపిణీ చేసిన 2వేల నోట్లు బ్లాక్ మార్కెట్‌లోకి వెళ్లడానికి ప్రధాన కారణం ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం.***

నోట్ల మార్పిడికి ప్రభుత్వం గుర్తింపు కార్డు జెరాక్స్ కాపీని సమర్పించాలని చెప్పింది. అయితే అందులో ఖాతాదారుడి సంతకం పెట్టాలన్న నిబంధన లేదు. సంతకం లేకుండానే జెరాక్స్ గుర్తింపు కార్డు కాపీని తీసుకుని నగదు మార్పిడి చేస్తూ వచ్చారు. అయితే కొందరు బ్యాంకు అధికారులు, పోస్టాఫీసు సిబ్బంది వచ్చిన గుర్తింపు జెరాక్స్‌లనే మళ్ళీ మళ్ళీ జెరాక్స్‌లు తీసి, వాటి ఆధారంగా డబ్బులు డ్రా చేసినట్లు చూపించి, ఆ డబ్బులనే బయట కమిషన్‌కు ముట్టజెప్పారు. ఉదాహరణకు గోపాలయ్య ఒకసారి బ్యాంకుకు వెళ్లి తన ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీ ఇచ్చి నాలుగువేల రూపాయలు తెచ్చుకున్నాడనుకుందాం. బ్యాంకు సిబ్బంది అదే కాపీని పది జెరాక్స్ కాపీలు తీయించి అదే పేరుతో 40వేలు డ్రా చేసి ఉండొచ్చు. ఇలాంటి డబ్బునే బయట అమ్మి ఉండొచ్చు. ఈ విధంగా చాలామంది వద్ద మళ్లీ బ్లాక్‌మనీ పోగయ్యింది. అదే గుర్తింపుకార్డు జెరాక్స్ కాపీ మీద ఖాతాదారుడి సంతకాన్ని తప్పనిసరి చేసి ఉంటే రెండువేల నోట్లు దారి మళ్లడానికి అవకాశం ఉండేది కాదు. నకిలీ జెరాక్స్ కాపీల మూలంగా అవసరానికంటే ఎక్కువగా రెండువేల నోట్లు, వంద నోట్లు పక్కదారి పట్టించబట్టే బ్యాంకుల ముందు, పోస్టాఫీసులలో నగదు మార్పిడి కోసం ఇప్పటికీ 'క్యూ'లు తగ్గడం లేదు.

# కరెన్సీ వద్దు... కార్డే ముద్దు!

### - జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు



నగదు రహిత లావాదేవీల గురించి ముమ్మరంగా ప్రచారం చేసే కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ అధికారులకు శిక్షణ నిచ్చి వచ్చేవారం అన్ని మండలాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు తెలిపారు.

ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోల్డెన్‌జూబ్లీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులకు ఒకరోజు నగదు రహిత లావాదేవీల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీల పట్ల అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి సరైన అవగాహన వున్నప్పుడే వారు ప్రజలను చైతన్యపరచగలరని, ఆ ఉద్దేశ్యంతో అధికారులందరికి శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. అందుకోసం నగరంలో 5కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

సిబ్బందికి డా॥ సి.వి.ఎస్.భాస్కర్, డా॥ టి.వెంకటేశ్వర్లు, బి.మోహన్‌బాబు, పి.నరేష్, డి.భక్తవత్సలం నగదు రహిత లావాదేవీల పట్ల పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణనిచ్చారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## కల్యాణ వైభవం...!



రిటైర్డ్ ఏ.సి.టి.వో పాలపర్తి సద్గురుమూర్తి - వరలక్ష్మిల కుమారుడు **ఈశ్వర్‌చంద్ - మమత** (తిరుపతి వాస్తవ్యులు శ్రీకారం పుల్లయ్య - ధనకొండమ్మల కుమార్తె)ల కళ్యాణం నవంబర్ 24వ తేదీ తిరుపతి - తిరుచానూర్‌లోని ఆర్‌కెఆర్ కళ్యాణ మండపం నందు, రిసెప్షన్ 27వ తేదీ నెల్లూరులోని పి.వి.ఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.

### క్రమశిక్షణను చాటిన...

# ఎన్‌సిసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



ఎన్‌సిసి 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నెల్లూరులో సుమారు 250 మంది ఎన్‌సిసి క్యాడెట్‌లచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విఆర్ కళాశాల, సర్వోదయ, కెఎసి కళాశాల, ఆత్మకూరు డిగ్రీ కళాశాల, సర్వోదయ, కెఎసి కళాశాల, ఆత్మకూరు డిగ్రీ కళాశాల, ఎన్‌బికెఆర్ డిగ్రీ కళాశాల సీనియర్ డివిజన్ క్యాడెట్లు, కెఎన్‌ఆర్ పాఠశాల, వెంగళరావునగర్, సెయింట్‌పీటర్స్, సిబి నగర్ ఆర్‌ఎస్‌ఆర్‌ఎం, సంఘమిత్ర పాఠశాల జూనియర్ డివిజన్ క్యాడెట్స్ పాల్గొన్నారు. అనంతరం విఆర్‌సి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సిసి, ఆర్మీ, నేవీ, ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రతిభ కనపరచిన ఎన్‌సిసి అధికారులకు, ఉత్తమ ప్రతిభ కనుపరచిన ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా విఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సివిఎస్ భాస్కర్ మాట్లాడుతూ, ఎన్‌సిసి క్యాడెట్లుగా వారు నేర్చుకున్న క్రమశిక్షణ, ధైర్య సాహసాలు వారి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదం చేస్తాయన్నారు. భావి పౌరులుగా వారు ప్రభుత్వ చట్టాలను గౌరవిస్తూ, ఉన్నత విలువలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తొలుత, ఎన్‌సిసి క్యాడెట్లచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో 241 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎ.కె వర్మ, 2 ఇఎంఇ కమాండింగ్ అధికారి కల్నల్ ఎం పస్‌బొలా, విఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అశోక్‌రావు, సీనియర్ డివిజన్ ఎన్‌సిసి అధికారులు డా.సివి.సురేష్, డా.ఎన్.ప్రభాకర్, డా. సుబ్రహ్మణ్యం, కె.మోహన్‌రావు, కృష్ణ ప్రసాద్, మోహన్‌రెడ్డి, బాలబ్రహ్మాచారి, ప్రసాద్, నరేంద్రబాబు, నాగరాజు, షాహుల్, శివశంకర్, చిరంజీవి, రమాన్, ఎస్ఎం శ్రీనివాసన్, మిలిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



# కుటీర పరిశ్రమలతో మహిళల ఆర్థికాభివృద్ధి

మహిళలు కుటీర పరిశ్రమల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి అన్నారు. గూడూరు పట్టణంలోని రాజావీధిలో ఉన్న సునీతా సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఉచితంగా ప్లాస్టిక్ బుట్టల అల్లికలను నేర్పించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతివృత్తులు నేర్చుకున్నందు వల్ల ఎలాంటి ఖర్చు లేకుండా ఇంటి వద్దనే ఖాళీ సమయాల్లో పనులు చేసుకుని కుటుంబానికి కావాల్సిన సంపాదన చేసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, శిక్షకురాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు ప్లాస్టిక్ బుట్టల అల్లికను నేర్పిస్తున్న సులక్ష్మి



## గూడూరు డివిజన్ వార్తలు

### మంగళంపల్లి బాలమురళీకృష్ణకు

# బ్రాహ్మణ సంఘం సంతాపం



పద్మవిభూషణ్, గానగంధర్వుడు, అపర త్యాగయ్య కీర్తిశేషులు డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆకస్మిక మరణానికి గూడూరు బ్రాహ్మణ సంఘం తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పై సభలో బ్రాహ్మణ సేవాసంఘం గూడూరు అధ్యక్షుడు యరగుడిపాటి చలపతి రావు మాట్లాడుతూ బాలమురళీకృష్ణ త్యాగరాజ కీర్తనలే కాకుండా అన్ని భాషల్లో తన యొక్క గాత్రాన్ని వినిపించడమే కాకుండా కొద్ది సినిమాలు అయినా అద్భుతమైన భావరాగతాళాలతో మేలవించిన గీతాలను ఆలపించారని కొనియాడారు. ఈ సభలో ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ 24,000 కచ్చేరీలు చేసి సంగీత సామ్రాజ్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొన్నట్లు కొనియాడారు. గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, వై.చిట్టిబాబు, కె.వి.సూర్యప్రకాషరావు, వై.పవన్‌కుమార్, ఎల్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో

# ఆకట్టుకొన్న సాంస్కృతిక కార్యక్రమాలు



విజేతలతో డిఎస్పీ శ్రీనివాస్, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, కె.మునిగిరీష్

గూడూరు పట్టణంలోని డిఎన్‌ఆర్ కమ్యూనిటి హాల్‌లో ఆదివారం విద్యార్థులు ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రోటరీ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు ఆదివారం సీనియర్ విభాగంలో గ్రూప్‌డ్యాన్స్‌ను ప్రదర్శించారు. పట్టణంలోని వివిధ స్కూళ్ల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఇంకా ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎన్నో చేసుకోవాలని విద్యార్థుల్లో ప్రోత్సాహాన్ని కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ భరత్‌కుమార్, రోటరీ అధ్యక్షుడు నాగసూరి గోపాలరావు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, రోటరీ సభ్యులు దశరథరామిరెడ్డి, దయాకర్‌రెడ్డి, కె.మునిగిరీష్, మునిరాజ, నాగేంద్రప్రసాద్, రాఘవేంద్రరెడ్డి, గురుగుహ, సేగు శ్రీనివాసులు, విష్ణువందన, ఎల్‌ఎపి శ్రీకాంత్‌రెడ్డి, వివేకానంద స్కూల్ చంద్రమోహన్, వివిధ స్కూళ్ల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు

# స్నేహలతారెడ్డికి గోల్డ్‌స్టార్ అవార్డు



ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డికి గోల్డ్ స్టార్ అవార్డును అందజేస్తున్న వీణాస్వామి

ప్రజల చెంతకు గూడూరు ఇన్నర్‌వీల్ క్లబ్ సేవలు అందుతున్నాయని ఇన్నర్‌వీల్ క్లబ్ జిల్లా ఛైర్మెన్ వీణాస్వామి తెలిపారు. ఇటీవల గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్‌లో జరిగిన నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని గూడూరు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డికి గోల్డ్‌స్టార్ అవార్డు ఒకటి, రెండు సుప్రీమ్ గోల్డ్ స్టార్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆరు మున్సిపల్ స్కూల్స్‌ను హ్యాపీ స్కూల్స్‌గా ప్రారంభించినట్లు తెలిపారు. సొసైటీ ప్రాంతంలో ఇరవై వేలు విలువ చేసే చెట్లు, ట్రీగార్డులు ఇచ్చినట్లు, రెండు కుట్టుమిషన్లు, ఒక సైకిల్ తన దాతృత్వంతో గిరిజన మహిళలకు ఇచ్చినట్లు తెలిపారు. 7వ వార్డులో వుండే మున్సిపల్ స్కూల్‌లో రూ.12,500/- విలువ చేసే బ్యాగులు, నాలుగు బెంచీలు ఇవ్వడం జరిగిందన్నారు. గూడూరు పట్టణంలోని నాలుగు స్కూల్స్‌కు నలభై బెంచీలు అందజేసినట్లు తెలిపారు. జిఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో లైబ్రరీ ర్యాకులు, స్కూల్‌లో వాకింగ్ ఏరియా కట్టించినట్లు, రూ.1.65 లక్షలు విలువచేసే కార్యక్రమాలను చేపట్టినట్లు, తాను ఇన్నర్‌వీల్ పదవి చేపట్టిన 4నెలల్లో 5లక్షలు విలువ చేసే కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు, సహాయసహకారాలతో ఈ కార్యక్రమాలు చేసినట్లు స్నేహలతారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి, రోటరీక్లబ్ అధ్యక్షులు నాగసూరి గోపాలరావు, దశరథరామిరెడ్డి, కె.మునిగిరీష్, జి.సురేంద్రరెడ్డి, రోటరీ వెస్ట్ అధ్యక్షులు సేగు శ్రీనివాసులు, ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ప్రభుత్వ అనుమతులందు ఆలస్యము, పిల్లల విద్యా వివాహ ఆరోగ్య విషయాలపై ఆందోళన ఉంటుంది. మీ విషయాలలో ఇతరులను జోక్యం చేయబడకుండా జాగ్రత్తపడాలి. శుభవార్తలు వింటారు. ఉద్యోగులకు అదనపు పనిభారం, అనుకోని ప్రయాణాలు, గృహ వస్తు వాహన రిపేర్లు, ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక భారంతో ఇబ్బంది పడతారు. ఆదాయం తగ్గవచ్చు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఫైనాన్స్ వ్యాపారులు, పరిశ్రమ యజమానులకు సమస్యలుండగలవు. ఉద్యోగులు పబ్లిక్‌తోను అధికారుల తోనే జాగ్రత్తగా మెలగండి. బంధువర్గం వల్ల చిన్న ఇబ్బందులు రావచ్చును. శుభకార్యాలలో పాల్గొంటారు, ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి రాబడి పెరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు పనిభారం పెరిగి శ్రమ ఎక్కువగా ఉంటుంది. సన్నిహితుల వల్ల కొత్త సమస్యలు రావచ్చును. వారాంతంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వృత్తిపరంగా అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. వ్యాపార వర్గాలకు ఆశించిన వృద్ధి లేకపోయినా సామాన్య ఆదాయముంటుంది. ఖర్చులు బాగా పెరిగిపోగలవు. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 2.12.2016 నుండి
తేది. 8.12.2016 వరకు

ఈ వారము సింహంలో రాహువు, గురువు కన్యలో, వృశ్చికంలో రవి శనులు, మకరంలో కుజశుక్రులు, కుంభంలో కేతువు, ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 4 ఆదివారం ఉదయం గంట 7.15 నుండి 9.20లోగా ధనుర్లగ్నమున వివాహ వ్యాపారాదులు. తేది 8 గురువారం ఉదయం గంట 7.30 నుండి 9.20లోగా గృహారంభ వివాహ వ్యాపారములు. రాత్రి గంట 2.0 నుండి 4.10లోగా కన్యాలగ్నమున వివాహ గృహప్రవేశాలు.

### మార్గశీర్ష మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 2 | శుక్ర | తదియ | రా॥ గం.9.41వ॥ |
| తేది. 3 | శని | చతుర్థి | రా॥ గం.10.30వ॥ |
| తేది. 4 | ఆది | పంచమి | రా॥ గం.10.54వ॥ |
| తేది. 5 | సోమ | షష్ఠి | రా॥ గం.10.41వ॥ |
| తేది. 6 | మంగళ | సప్తమి | రా॥ గం.10.03వ॥ |
| తేది. 7 | బుధ | అష్టమి | రా॥ గం.8.54వ॥ |
| తేది. 8 | గురు | నవమి | రా॥ గం.7.30వ॥ |

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. వస్తు నష్టం, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం, కొత్త పరిచయాలు బలపడటం జరుగుతుంది. హామీలు అప్పులు ఇవ్వకండి. శుభవార్తలు వింటారు. కుటుంబసౌఖ్యముంటుంది. విద్యార్థులకు మంచి ప్రగతి కలదు. ఇంట బయట కొత్త సమస్యలు ఏర్పడవచ్చును. వృత్తి వ్యాపారంలో స్వల్ప వృద్ధి, సామాన్య ఆదాయం.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వస్తు వాహన రిపేర్లుంటాయి. తప్పనిసరి ప్రయాణాలు జరుపుతారు. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు కొత్త బాధ్యతలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలందు అవకాశాలు లభించగలవు. కొత్త పెట్టుబడులు, పొదుపు పథకాలకు అనుకూలత ఉంటుంది. విద్యాప్రగతి కలదు. ఆర్థిక స్థితి బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు తగలడం ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, విద్యాప్రగతి బాగుంటుంది. అనుకున్న పనులను పట్టుదలగా సాధిస్తారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఆదాయం పెరుగుదల ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. స్థిరాస్తుల క్రయ విక్రయాలు జరుగగలవు. శాస్త్ర సాంకేతిక కళా క్రీడారంగాల వారికి మంచి అవకాశాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. కుటుంబసౌఖ్యం, విద్యాప్రగతి బాగుంటుంది. ఖర్చులు ఎక్కువుగా ఉన్నా, ఇబ్బందులుండవు. వ్యవహారాల్లో నిష్కర్షగా వ్యవహరించండి. చేపట్టిన పనులు పట్టుదలతో జరుపుకొంటారు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చిన్న చిన్న శారీరక ప్రమాదాలుండవచ్చును. ఉద్యోగార్థులు చిత్తశుద్ధితో కృషి చేయండి. నిర్మాణాలు చేపట్టుతారు. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. అత్యవసర ప్రయాణాలుంటాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు, స్థాన మార్పులుండవచ్చును. కొత్త వస్తువులు సమకూర్చుకుంటారు. వృత్తి ఉపాధి రంగాల వారికి ఆర్థిక స్థితి సంతృప్తికరంగా ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులు నిదానంగా సాగి టెన్షన్ పెడుతుంటాయి. వాహనాలు, యంత్రాలు నడిపేవారు జాగ్రత్త పడాలి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలుండగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. కొత్త పరిచయాలు పెంచుకొంటారు. ఆర్థికంగా బాగుండినా ఖర్చులు ఆదాయం సరిపోతుంటుంది. స్వల్పంగా ఋణం చేసినా ఆశ్చర్యం లేదు. వ్యాపార రంగాలకు కొత్త ప్రణాళికలతో సాగుతారు. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆత్మీయులతో ఒక సమస్య పరిష్కారం కాగలదు. ఉద్యోగులకు అధికారుల తోడ్పాటుంటుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా, కుటుంబసౌఖ్యం బాగుండినా టెన్షన్ పడుతుంటారు. సభలు సమావేశాల నిర్వహణలో పాల్గొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ఆర్థికంగా స్థిరపడతారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

నిర్మాణాలు చురుకుగా సాగుతాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు, అనుకోని ప్రయాణాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనవసర వ్యవహారాలలో చిక్కుకొనకుండా జాగ్రత్త పడండి. ఆరోగ్యం బాగుంటుంది. అదనపు ఖర్చులుండినా ఇబ్బంది లేదు. స్థిరాస్తుల లావాదేవీలలో జాగ్రత్తపడండి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

దూరప్రయాణాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అధికారులు, సహచరులు మీకు తోడ్పడగలరు. ఋణ బాధలు, అనారోగ్య సమస్యలు సర్దుబాటు కాగలవు. విలువైన వస్తువులు, డబ్బు జాగ్రత్త పరుచుకొనండి. ఉద్యోగులకు పని ఒత్తిడి, అధికారుల వత్తిడి ఉంటుంది. చేపట్టిన పనులు, పెండింగ్‌లో పనులు సక్రమంగా జరుగుతాయి. శుభకార్యాలు ఖరారు కాగలవు.

# బ్లాక్‌ను వైట్‌గా మారుస్తున్న వివేకా



శ్రీను గల్పిక

"ఓ అప్పారావు... ఓ సుబ్బారావు... ఓ వెంకట్రావు... ఓ రంగారావు... ఎవరో ఎవరో వస్తారనుకుంటే నువ్వొచ్చావా... అయినా కానీ... రెడీ రెడీ రెడీరెడీ... అంగట్లో అన్నీ ఉన్నాయ్, వాకిట్లో అందాలున్నాయ్... చీకట్లో చిందులు ఉన్నాయ్... ఏమేమ్ కావాలి... నీకేమేమ్ కావాలి... మాలో ఎవ్వరు కావాలి..." బొబ్బిలి పులి సినిమాలోని పాట రింగ్‌టోన్‌తో అదే పనిగా తన సెల్ ఫోన్ మోగుతుండడంతో స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(65) కళ్లు తెరిచాడు. ఆయనకు అంతా చీకటిగా వుంది. ఇంత అర్ధరాత్రి వేళ ఫోన్ చేసింది ఎవరా... అనుకుంటూ ఫోన్ ఆన్ చేశాడు. అవతల నుండి వాయిస్ రికార్డ్ మెసేజ్... "మీ బ్లాక్ మనీని వైట్ మనీ చేసుకోవాలనుకుంటున్నారా... మీకు అండగా వుంది బ్లాక్‌బస్టర్ మనీ డాట్ కామ్. లక్ష రూపాయల లోపు బ్లాక్‌మనీని వైట్‌గా మార్చాలనుకుంటే ఒకటి నొక్కండి, ఒక లక్ష నుండి 10లక్షలలోపు కోసం రెండు నొక్కండి, 10లక్షల నుండి కోటి రూపాయల కోసం మూడు నొక్కండి, కోటి రూపాయలకు పైన మార్చాలనుకుంటే నాలుగు నొక్కండి... కేవలం ముప్పై శాతం కమీషన్‌తోనే మీ బ్లాక్‌మనీని వైట్ మనీగా మారుస్తాం... డబ్బు మీది... భద్రత మాది" అనే క్యాప్షన్‌తో ఆ వాయిస్ మెసేజ్ ముగిసింది. వివేకా ఏ నెంబర్ నొక్కకుండానే కాల్ కట్ చేసి, సెల్‌ఫోన్‌లో టైం చూసాడు. ఉదయం 6గంటలైంది. అయినా ఇంకా చీకటిగా ఉందేదబ్బా అనుకుంటూ కళ్లు జిలగా ఉండడంతో నులుముకోబోయాడు... కళ్ల వద్ద ఆయనకు నల్లద్దాలు తగిలాయి. అప్పుడు గుర్తుకొచ్చిందాయనకు... రాత్రి పడుకోబోయే ముందు కళ్లకున్న నల్లద్దాలు తీయడం మరచిపోయాననే విషయం. ఆయన నల్లద్దాలు తీసాడు. అప్పుడు ఆ గదంతా ఆయనకు ఎంతో కాంతివంతంగా కనిపించసాగింది. రాజూ అంటూ తన పిఏను కేకేసాడు. రాజు చేతిలో ఆరోజు పత్రికలను పట్టుకుని లోపలకు వచ్చాడు. వివేకా పేపర్లను తిరగేయసాగాడు. ఏ పత్రికలో చూసినా... "30శాతం కమిషన్‌తో చేతులు మారుతున్న నల్లధనం"... అన్న వార్తలే... ఈ వార్తలు చూసాక వివేకా మెదడులో ఒక మెరుపు మెరిసింది. వెంటనే రాజుతో... తెల్లధనం కోసం మన నెల్లూరు ప్రజలు ఎన్నో తంటాలు పడుతున్నారు. తమ దగ్గరున్న నల్ల డబ్బును తెల్లడబ్బు చేసుకోవడానికి ఉత్తి పుణ్యానికి లక్షకు 30వేల రూపాయలు కోల్పోతున్నారు. ఇలాంటి కష్ట కాలంలో మనం నెల్లూరోళ్లను ఆదుకోవాలి, మనమేంటో నిరూపించుకోవాలి... వెంటనే ఈ స్లోగన్స్‌తో ఫ్లెక్స్‌లు తయారు చేయించు అని కొన్ని నినాదాలు వ్రాసిన పేపర్లను రాజుకిచ్చాడు.

★★★★★

అది ఏ.సి సెంటర్‌లోని ఆనం వివేకా కార్యాలయం. అక్కడొక పెద్ద ఫ్లెక్సీ బ్యానర్ మీద ఇలా వ్రాసి వుంది... మీ నల్లధనాన్ని తెల్లధనంగా మార్చి ఇవ్వబడును. కమిషన్ వెయ్యికి వంద రూపాయలు మాత్రమే... ఇట్లు మీ, వివేకా... ఇలాంటి ఫ్లెక్సీ బ్యానర్‌లను నగరమంతా కట్టారు. ఇలా బ్యానర్లు కట్టిన విషయాన్ని అన్ని టీవీ ఛానెల్స్ ప్రసారం చేయడంతో ఈ వార్త ఏపి, తెలంగాణలకే కాక దేశమంతా పాకిపోయింది. చాలామంది నల్లకుబేరులైతే వివేకా సెల్‌కు ఫోన్‌లు చేస్తూ... ఈ కష్టకాలంలో నల్లధనవంతుల పాలిట ఆపద్బాంధవుడిలా నిలిచావంటూ అభినందించసాగారు. ఈ వార్త తెలిసి ఏపి నుండే కాక వివిధ రాష్ట్రాల నుండి రాజకీయ నాయకులు, వడ్డీ వ్యాపారులు సూట్‌కేసులు, గోతాం సంచులలో డబ్బులు తీసుకుని ఏ.సి సెంటర్‌కు వచ్చారు. వివేకా పిఏలు రాజు, ఫణిలు వచ్చిన వారందరినీ అక్కడే వేసిన టెంట్‌ల వద్ద కూర్చోబెట్టి టోకెన్‌లు ఇవ్వసాగారు. నల్లధనాన్ని తీసుకోవడానికిగాను నెల్లూరుజిల్లా వారికి ప్రత్యేకంగా ఒక కౌంటర్, బయట ప్రాంతాల వారికి ఇంకో కౌంటర్ పెట్టసాగారు. వివేకా నల్లధనాన్ని ఏ రూపంలో తెల్లధనంగా మారుస్తున్నాడో తెలుసుకోవడానికి తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి, నారాయణ, బీద రవిచంద్ర, అజీజ్, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైకాపా నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు తలో యాభైవేలు తెచ్చి టోకెన్ ప్రకారం తమ నెంబర్ వచ్చినప్పుడు కౌంటర్‌లో కట్టారు. నల్లడబ్బు కట్టిన వారందరికీ కూడా గంట తర్వాత తెల్లడబ్బు ఇస్తామని షరతుపెట్టి ఉండడంతో అందరూ రెండు వేల కొత్త నోట్లు ఇస్తారనే ఆశతో ఆసక్తిగా కూర్చుని ఎదురుచూడసాగారు. వివేకా ఆధ్వర్యంలో రెండు కౌంటర్లలోకి కట్టలు కట్టలుగా పాత డబ్బులు వస్తున్నాయి. కొంతమంది వివేకా అనుచరులు వాటిని తీసుకుని వెనుక గదిలోకి పోతున్నారు. అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. అన్ని టీవీ ఛానెల్స్ వాళ్లు కూడా ఒబి వ్యాన్‌లను అక్కడికే తీసుకొచ్చి నల్లధన మార్పిడిని, కోట్ల కొద్ది అక్కడ పడుతున్న డబ్బును ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించసాగారు. ఇలా నల్లకుబేరుల నుండి పాతనోట్లు తీసుకునే ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే అక్కడికి కొన్ని కార్లు వేగంగా దూసుకొచ్చాయి. వాటిల్లో నుండి సిబిఐ అధికారులు వేగంగా దూకారు... దూకిందే తడవుగా డబ్బులు తీసుకుంటున్న కౌంటర్లను సీజ్ చేశారు. సిబిఐ వాళ్లను చూడగానే బయట ప్రాంతాలనుండి వచ్చిన నల్లకుబేరులు చెల్లాచెదురయ్యారు. సిబిఐ అధికారి ఒకరు... ఈ కుంభకోణానికి మూలకర్త వివేకా ఎక్కడ? అని ప్రశ్నించాడు. అక్కడే వున్న అబ్దుల్ అజీజ్... అదిగో ఆ గదిలో వున్నాడని చూపించాడు. సిబిఐ అధికారులు అలర్ట్‌గా వుంటూ ఆ గదిలోకి ఒక్క ఉదుటున దూసుకెళ్లారు. వారి వెనుకే జిల్లా టీడీపీ, వైసిపి నాయకులు కూడా వెళ్లారు. అంతే అక్కడ కనిపించిన దృశ్యం చూసి సిబిఐ అధికారులతో పాటు నాయకులు కూడా గుడ్లు తేలేసారు. అక్కడ వివేకా కుర్చీలో కూర్చుని పాత నోట్ల కట్టలను వైట్ పెయింట్ డబ్బాలలో ముంచి బయటకు తీసి ఫ్యాన్‌ల క్రింద ఆరబెడుతున్నాడు. ఆ గదంతా కూడా సంతపేటలోని సింహపురి పెయింట్స్ షాపులో కొన్న ఏషియన్, నెరోలాక్, నిప్పాన్ పెయింట్ డబ్బాలున్నాయి. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చడమంటే ఇలాగా... అని సిబిఐ వాళ్లు నోరెళ్లబెట్టగా... వారిని చూసి వివేకా... మీరెంత డిపార్ట్‌మెంట్ వాళ్లయినా కూడా ముందుగా ఇవ్వడం కుదరదు, వెళ్లి టోకెన్ తీసుకోండి... అని చెప్పి, తన పని తాను చేసుకోసాగాడు.

# ఊబకాయంతో జాగ్రత్త



- డా. ఎం. పెంచలరెడ్డి

ఊబకాయంతో రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని, కనుక ఈ సమస్య వున్నవారు అప్రమత్తంగా వుండి ఊబకాయాన్ని తగ్గించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఎం. పెంచలరెడ్డి అన్నారు.

ప్రపంచ ఊబకాయం వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గత నెల 26న నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ మానవాళి నేడు ఎదుర్కొంటున్న పెద్దసమస్యల్లో ఊబకాయం ఒకటని, ఇది ఎంతో ప్రమాదకరమైనదని అన్నారు. ఊబకాయం ఎన్నో రకాల అనారోగ్యాలను కలిగిస్తుందన్నారు. అధిక బరువు అనారోగ్యానికి కారణమవుతుందని, షుగరు, రక్తపోటు, గుండెపోటు, కొలెస్ట్రాల్, పక్షవాతం, కీళ్ళనొప్పులు, కిడ్నీ సమస్యలు వగైరాలు కూడా ఈ సమస్య వున్నవారిలో మరింత అధికమవుతాయని, కనుక ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచి ఆరోగ్యానికి రాజమార్గం వ్యాయామం ఒక్కటేనన్నారు. వ్యాయామం ఊబకాయాన్ని జయిస్తుందన్నారు. మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, నడక ఎంతో ఆరోగ్యకరమని, నడక వల్ల ఎన్నో రకాల వ్యాధులు, సమస్యలు దూరమవుతాయని అన్నారు. నెల్లూరులో స్థాపించిన తొలి పాథాలజీ లేబొరేటరీ విజయలేబొరేటరీలో ఇప్పటి దాకా ఎంతోమందికి రోగనిర్ధారణ పరీక్షలు చేశామని, దీనికి అనుబంధంగా ఒబిసిటీ క్లినిక్-2000 కూడా స్థాపించామని, ఇందులో శిక్షణ తీసుకున్నవారు ఎంతోమంది లావు, బరువు తగ్గి, ఆరోగ్యంగా వున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయుర్వేదం, యోగ, నేచర్‌క్యూర్ వంటి శాస్త్రీయ పద్ధతుల ద్వారా బరువు తగ్గించుకునేందుకు తాము శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు తమను సంప్రదించాలని ఆయన కోరారు.

# వాకర్స్‌కు ఉచిత ఆరోగ్యపరీక్షలు



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వాకర్స్‌కు ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొదటి అదనపు సీనియర్ జడ్జి భూపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. తాను గత రెండు సంవత్సరాల నుంచి వాకింగ్‌కు వస్తున్నానని, అసోసియేషన్‌వారు ప్రతి నెల మొదటి తేదీన సుమారు 300 మందికి బిపి, షుగర్ టెస్టులు చేస్తున్నారని, అంతేకాక ప్రతిరోజు వాకర్స్‌కు అందరికీ మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నారన్నారు. ప్రతి నెలా రెండవ ఆదివారం ఆరోగ్యం పట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని, ప్రతి మూడునెలలకు ఒకసారి తక్కువ ఖర్చుతో ఆరు రకాల ఆరోగ్యపరీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన అభినందించారు. ముస్ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలను వారు మరిన్ని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదలశాఖ డి.ఇ కాటంరెడ్డి గోపాల్‌రెడ్డి షుగర్ టెస్టులకు స్ట్రిప్సు అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేలూరు రంగారావు, సెక్రటరీ స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, డాక్టర్ అంకిరెడ్డి, శ్రీనివాసకుమార్, డాక్టర్ ఎం.ఎస్ రెడ్డి, దొరస్వామినాయుడు, డా.కోటేశ్వరరావు, సత్యనాథ్, నలుబోలు బలరామయ్యనాయుడు, జయదేవ్, షణ్ముఖరావ్, చంద్రమౌళి, రమణ, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# శైవక్షేత్రాల్లో... కార్తీకశోభ



పవిత్ర కార్తీక మాసంలో విశిష్టమైంది సోమవారం. నెల్లూరులోని అన్ని శైవక్షేత్రాలు కార్తీక శోభతో అలరించాయి. కార్తీకమాస చివరి సోమవారాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శివనామ స్మరణలతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. గోపూజ, స్థపన పూజ, క్షీరాభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశ దీపాలంకరణ, రుద్రహోమం, జ్వాలా తోరణం తదితర విశేషపూజలను నిర్వహించారు. మహిళా భక్తులు విశేషంగా పాల్గొని కార్తీక దీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మాసశివరాత్రి ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి, ఇఒ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు. దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు విశేషంగా పాల్గొని దీపారాధనలు నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం, నవాబుపేటలోని శ్రీ అన్నపూర్ణ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం, వహబ్‌పేటలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో, సంతపేట శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో విశేషపూజలు, అభిషేకాలు, ఆకాశదీపాలంకరణలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# రాజకీయ ఉనికి కోసమే ఈ రచ్చ!



జనచైతన్య యాత్ర ముగింపు సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న తెదేపా నాయకులు



## కావలి కబుర్లు

కావలి నియోజకవర్గంలో జనచైతన్య యాత్రలు ముగింపు సందర్భంగా రాజధాని నిర్మాణకమిటీ సభ్యులు, మాజీ శాసన సభ్యులు బీదా మస్తాన్‌రావు సూచనల మేరకు బుధవారం తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరిల ఆధ్వర్యంలో 32,33,34,37వ వార్డులలో జనచైతన్యయాత్రలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వచ్చిన మాజీ మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఎంయల్‌సిలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, బీదా రవిచంద్రలకు మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి కార్యకర్తలు నృత్యాలతో ఎంతో ఆట్టహాసంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జనచైతన్యయాత్రలు ముగింపు సందర్భంగా కళుగోళమ్మ శాంభవి దేవస్థానం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. తొలుత వెంకటేశ్వర థియేటర్ వద్ద నుండి ర్యాలీ ప్రారంభించిన నాయకులు ప్రజలకు అభివాదం చేస్తూ బహిరంగ సభకు చేరుకున్నారు. వీరి రాకతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారడంతో నాయకులు కార్యకర్తలు పూలతో ఘనస్వాగతం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా జనచైతన్య యాత్ర ముగింపు సభలో మాజీ మంత్రి రామనారాయన రెడ్డి మాట్లాడుతూ... నేడు రాష్ట్రంలో ఒక్క తెలుగుదేశంపార్టీకి తప్ప మరే పార్టీకి మనుగడ లేదని, వారి ఉనికిని కాపాడుకునేందుకే అప్పుడప్పుడు ఒక రాస్తారోకో, ఒక ధర్నాల వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని అన్నారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని, అమరావతి రాజధానిని ప్రపంచస్థాయిలో నిర్మించగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఉందని కొనియాడారు. అలాగే కావలి నియోజకవర్గంలో వందల కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులు చేసిన బీదా మస్తాన్ రావు లాంటి ఒక మంచి నాయకుడిని గెలిపించుకోలేకపోయామని ఆవేదన చెందారు. ఇలాంటి తప్పిదం పునరావృతం కాకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, అలాగే కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని సూచించారు. అనంతరం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, బీదా రవిచంద్రలు ఉపన్యసించారు. జనచైతన్య యాత్ర ముగింపుసభలో ఇంత పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడం అభినందనీయమని, అందుకు అహర్నిశలు శ్రమించిన మలిశెట్టి వెంకటేశ్వర్లును అభినందిస్తున్నానని మస్తాన్ రావు అన్నారు. కార్యక్రమంలో ఎయంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రమణ్యం, ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లు గ్రంధి యానాదిశెట్టి, నగళ్ళ శ్రీనివాసకిరణ్, ప్రముఖ న్యాయవాది శ్రీనివాసులు, తెదేపా నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మధ్యతరగతి ప్రజల అభివృద్ధే బీజేపీ లక్ష్యం



గ్యాస్‌స్టవ్‌ను అందచేస్తున్న కందుకూరి సత్యన్నారాయణ

మధ్యతరగతి ప్రజలను అభివృద్ధి చేయడమే బీజేపీ లక్ష్యమని అందుకు ప్రధాని ఉజ్వల పథకం కింద మహిళలకు ఒక్క రూపాయి పెట్టుబడి లేకుండా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి వెంకటసత్యన్నారాయణ అన్నారు. బుధవారం కొనదిన్నె గిరిజన కాలనీలో ఉజ్వలపథకం కింద 70మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అతి సాహసమైన నల్లధనాన్ని వెలికి తీయడానికి మోడీ కృషి చేస్తున్నారని పాకిస్తాన్‌నుంచి వస్తున్న నకిలీ కరెన్సీని ఆపడంద్వారా ఉగ్ర వాదానికి అడ్డుకట్టవేయాలని నిర్ణయించారన్నారు. కొద్దికాలంలోనే అన్ని ఇబ్బందులు తొలిగిపోయి ప్రజలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ కార్యక్రమంలో సివిసి సత్యం, బీజేపీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# జగదీష్ చంద్రబోస్ జయంతి



విద్యార్థులకు జీకే పుస్తకాలు అందచేసిన నిర్వాహకులు

సీర్స్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం జగదీష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరావు జగదీష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ మొక్కలకు ప్రాణం ఉందని మనలాగే అవి బాధపడుతాయని 1901లో కనుగొన్న గొప్ప శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ అని కొనియాడారు. విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించి జీకే పుస్తకాలను బహుమతిగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాదరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీత పోటీలకు మంచి స్పందన

నెల్లూరు నగరంలో గత నెల 27న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత కంఠస్త పోటీలకు చిన్నారులు, వయోజనుల నుంచి మంచి స్పందన కనిపించింది. ఈ పోటీల్లో మొత్తం 151 మంది పాల్గొన్నారు. ఎల్‌కేజి నుంచి 3వ తరగతి స్థాయి వరకు జరిగిన పోటీలో టి. సాయి ఆదర్శ, ఎం.గణేష్‌వర్ధన, పి.అక్షయ వరుసగా ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను, 4 నుంచి 7వ తరగతి వరకు జరిగిన పోటీలో జి.నాగేశ్వరి, సిహెచ్ దేవి, ఎన్. విష్ణు, 8 నుంచి 10వ తరగతి స్థాయి వరకు జరిగిన పోటీలో వి.సాయి ఉమా మహేశ్వరి, ఎన్.దివ్య, సిహెచ్ సంధ్య, కళాశాల విద్యార్థులు ఎం. యెునిషా, సిహెచ్ మేఘన, కె.మనోజ్ఞసుందరి బహుమతులు సాధించారు. పురుషుల విభాగంలో ఎం.శ్రీనివాసరావు, టి.వేణు, జె.నాగేశ్వరరావు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా, వయోజన స్త్రీల విభాగంలో సిహెచ్ హేమమాలిని, ఎం.నాగేశ్వరి, ఎన్.రమాదేవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరందరికీ త్వరలో చిన్నబజారులోని మీనాక్షి కళ్యాణమండపంలో జరిగే జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్త పోటీల్లో బహుమతులు అందజేస్తామని విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు గుండా ఆంజనేయులు, జిల్లా ప్రచార ప్రముఖ్ ఇవస్ జగదీశ్వర్, పోటీల నిర్వాహకులు బయ్యా శ్రీనివాసులు పేర్కొన్నారు.

# నిరుద్యోగులకు నర్సింగ్‌లో ఉచిత శిక్షణ

మెప్మా మరియు బొల్లినేని మెడిస్కిల్స్ (బొల్లినేని హాస్పిటల్) వారి ఆధ్వర్యంలో మునిసిపాలిటీ ప్రాంతంలోని 18–30 సంవత్సరాల నిరుద్యోగ యువతీ యువకులకు నర్సింగ్ రంగంలో మూడునెలల పాటు ఉచిత శిక్షణ ఉపాధి తరగతులు బొల్లినేని ఆసుపత్రిలో నిర్వహిస్తామని మెప్మా పథక సంచాలకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషియన్స్–బేసిక్స్ కోర్సు, డయాబిటెక్ ఎడ్యుకేటర్ కోర్సులకు 10వ తరగతి విద్యార్హత అని, వారికి 3 నెలలపాటు వారికి పూర్తిగా ఉచిత శిక్షణ వుంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం బొల్లినేనితో పాటు వివిధ ఆసుపత్రుల్లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. వివరాలకు 7337362529, 0861–2307771 ఫోన్ నంబర్లుకు సంప్రదించాలని కోరారు.

## నో(నా)టు బాంబు!

- చిన్ని నారాయణరావు
9440202942

నో(నా)టు బాంబు పేలి
బద్దలైంది
సామాన్యుడి గుండెల్లో
గునపాలు దించినట్లయ్యింది
నిన్నటి దాకా రాజై
రాజ్యమేలిన నోటు
ఎంతటి దైన్యాన్ని పులుముకొందో
ఒక్కసారిగా దిగాలు పడి
పోయింది
రగిలిన వలస కూలీల
ఆకలి కాష్టంలా
అవినీతి ప్రక్షాళనలో
తాను బలికావడమేంటని
అయిదు వందల నోటు
అవాక్కయి అందరినీ
ప్రశ్నిస్తోంది.
కూలిపని మానేసి బ్యాంకు
చుట్టూ తిరిగే కార్మికుల కష్టాలు
కన్నీళ్ళతో బావురుమన్నట్లు
నల్లధనం లాకులెత్తిన
సందర్భంలో దేశానికి
మేలు జరగద్దంటే
బ్రతుకు సార్థకమంటున్నది నోటు!
కూలీలంతా కలిసి
దేశ ప్రగతికి జై కొట్టినట్లు...!
తనపై టెర్రరిస్టులకూ
మోజు పెరిగిందని చెబితే
విని అర్థంకాని వెర్రిదైంది
అయిదు వందల నోటు!
తమ రెక్కల కష్టంతో సైతం
పొట్ట పోసుకోడానికీ వీల్లేదన్న
నాయకుల మాటల్లా...!
గల్లాల్లో గదుల్లో గోదాముల్లో
ఇనుప కట్టడాల్లో
రాజై ఊరేగుతున్న
ప్రభంజనానికి అడ్డుకట్ట వేయడంతో
ఒక్కసారిగా 'నోటు'
బ్రతుకు శూన్యమయింది
చిరు వ్యాపారుల వెతల కథ
మిన్నంటి ఎగిసి వెలసింది
సన్నజనం ఉనికి
ఛిద్రమయింది
జనాగ్రహం కట్టలు తెంచుకొంటే
ప్రభుత్వమే పతనమై
కుప్పకూలిపోతుంది

# సీట్లకు కోత..

(మొదటి పేజీ తరువాయి)

వైద్యకళాశాలలో 150సీట్లకు కోతేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 300సీట్లకు కోత విధించగా అందులో 150 సీట్లు అంటే సగం నెల్లూరు కాలేజీలోనే కావడం విచారకరం. ఈ సీట్ల కోత 2017–18 వైద్య సంవత్సరానికి వర్తిస్తుంది. నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రమాణాలు తగ్గడానికి గాని, తగినంత బోధనా సిబ్బంది లేకపోవడానికి గాని మంత్రులదే ప్రధాన బాధ్యత. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఒక వ్యాపారవేత్త. సొంత కార్పొరేట్ ఆసుపత్రుల మీదున్న శ్రద్ధ ప్రభుత్వ కాలేజీల మీద ఎందుకుంటుంది? ఇక జిల్లా మంత్రి పి.నారాయణ ఈ కళాశాల అభివృద్ధి గురించి ఆలోచించాలి. కాని ఆయనకు సొంత మెడికల్ కాలేజీనే వుంది. దానిని చూసుకోవడానికే టైం దొరకదు. అదీగాక, అక్కడంతా మేనేజ్‌మెంట్ వ్యవహారమే! నారాయణ వైద్యకళాశాలకు ఎంసిఐ బృందం వస్తే... అక్కడంతా శంకర్‌దాదా ఎంబిబిఎస్‌లు తయారవుతారు. పొగతోటలో సొంత ప్రాక్టీస్ వున్న డాక్టర్లంతా అక్కడ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అవుతారు. రాజకీయ నాయకుల సభలకు జనాన్ని తోలినట్లు నారాయణ ఆసుపత్రికి రోగుల్ని బస్సుల్లో పెట్టి తరలిస్తారు. ఆ విధమైన మేనేజ్‌మెంట్‌తోనే నారాయణ నెట్టుకొస్తున్నాడు. ప్రభుత్వ వైద్యకళాశాలలో అలాంటి మేనేజ్‌మెంట్‌లు లేవు కాబట్టి సీట్ల కోత – చదువుకు వాత తప్పడం లేదు.

# కమ్ముకొస్తున్న కరువు

(మొదటి పేజీ తరువాయి)

ఈసారి రబీలోనైనా ఆ కష్టాలు తీరిపోయి, పంటల సాగుకోసం సిద్ధమవుదామనుకుంటే ఎక్కడా చుక్క నీరు కనిపిస్తేగా!..వరుణుడి కరుణ కోసం రైతులు, రైతు కుటుంబాల వారు ఎన్నెన్ని ప్రార్ధనలు చేసినా నీలిమబ్బు వూరిస్తూ కనిపిస్తుందే తప్ప చినుకు విదల్చడం లేదని రైతన్నలు తీవ్ర ఆవేదనలో వున్నారు. ముఖ్యంగా జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లోని రైతన్నలు ఈ రబీలో పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. చినుకు రాలక పొలాలన్నీ బీడులుగా మారిపోతున్నాయి. అత్యధికశాతం చెరువుల్లో చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి. బోర్లు, బావుల కింద సాగుచేసిన పైర్లకు భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీరందక ఎండుముఖాలు పెడుతున్నాయి. జిల్లాలో వరి ప్రధాన పంట కనుక, జిల్లాలోని రైతులు అన్ని ప్రాంతాల్లో ఈ రబీ సీజన్‌లో వరిని విస్తారంగా వేసుకుంటారు. రబీ సీజన్‌లో కనీసం రెండు లక్షల హెక్టార్లలో వరి పంట సాగువుతుంటుంది. అయితే, ఇప్పుడు ఈ వర్షాభావ పరిస్థితుల్లో కేవలం 40 వేల హెక్టార్లలోనే వరి వేసుకున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో తేటతెల్లమవుతుంది. వేసుకున్న ఆ కొద్ది పంట కూడా బోర్లు, బావుల కిందనే వున్నాయి. వర్షాధారంగా వేసుకున్న పైరంతా అటు వాననీరు కానీ, ఇటు సాగునీరు కానీ లేకపోవడంతో ఎక్కడి నార్లు అక్కడ ఎండిపోతున్నాయి. అసలే వ్యవసాయం ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అప్పోసప్పో చేసి నార్లు వేసుకున్నా నీరు లేకపోవడంతో ఇక పంటలు పండేదెప్పుడు?..తీసుకున్న అప్పులు తీరేదెప్పుడు అనే దిగులు సామాన్య రైతులను కుంగదీస్తోంది. ఒకవేళ మరింత వ్యయం చేసి కొత్త బోర్లు వేసుకుందామన్నా భూగర్భజలాలు అందకపోవడంతో వేసుకున్న బోర్లు కూడా వెలవెలబోతున్నాయని మెట్ట ప్రాంత రైతులు లబోదిబోమంటున్నారు.

## అప్పుడు భారీవర్షాలు..ఇప్పుడు కరువుతో కష్టాలు :

సాధారణంగా నవంబరు నెల అంటేనే జిల్లాకు వర్షాలమాసం. గత ఏడాది నవంబర్‌లో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. కుండపోత వానతో జిల్లా అతలాకుతలమైంది. వరదనీటి ప్రవాహానికి అనేకచోట్ల రోడ్లు తెగిపోయాయి. నెల్లూరు నగరం కూడా భారీవానతో ఎక్కడ చూసినా జలమయమైంది. పలుచోట్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిని వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. మన్సూర్‌నగర్ తదితర ప్రాంతాల్లో కాలువ కట్టలు పొంగిపొర్లి ఇళ్ళన్నీ మునకకు గురయ్యాయి. గత ఏడాది జలదిగ్బంధనంలో చిక్కుకుని అవస్థల పాలైన జిల్లా ఈసారి కరువు కోరల్లో చిక్కుకుంటోంది. సాధారణంగా జిల్లాలో నవంబర్, డిసెంబర్‌లలో మంచి వానలు కురుస్తుంటాయి. వ్యవసాయానికి కూడా ఇదే మంచి అదును కావడంతో రైతులు ఈ రెండు నెలల్లో బాగా వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని ఎన్నో ఆశలతో సేద్యానికి సిద్ధమవుతుంటారు. కానీ ఇప్పుడు నవంబర్ నెల పూర్తయినా వానలు కురవకపోవడంతో రైతన్న మరింత దిగులుతో ఈసారి పంటల పరిస్థితి ఏమిటని ఆవేదనలో మునిగిపోతున్నాడు. ముఖ్యంగా మెట్టప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు, సీతారామపురం, దుత్తలూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట, అనంతసాగరం, జలదంకి, వింజమూరు, కలిగిరి, కొండాపురం, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ, వెంకటగిరి, చేజర్ల, రాపూరు, బాలాయపల్లి, పొదలకూరు, దక్కిలి, చిల్లకూరు, చిట్టమూరు, సైదాపురం, తదితర అనేక మండలాల్లో సాగునీరు అందక రైతుల బాధలు దయనీయంగా వుంటున్నాయి. విత్తనాలు కొనుగోలు చేసుకుని నారుమడులు సిద్ధం చేసుకున్నవారు, వానల కోసం ఎదురుచూసి విసిగిపోతున్నారు. ఎంతో కష్టపడి వేసుకున్న నార్లు కళ్ళముందే ముదిరిపోయి ఎండిపోతున్నాయని, కొన్నిచోట్ల నార్లు తెగుళ్ళబారిన పడి ఎటూ కొరగాకుండా పోతున్నాయని మరికొన్ని ప్రాంతాల రైతులు కంటతడిపెడుతున్నారు. కొన్నిచోట్ల వరికి ప్రత్యామ్నాయంగా వేసుకున్న మినుము, పెసర, కంది తదతర పంటలు కూడా అదునుకు వానలు లేక ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించినా రైతులకు మాత్రం ఎలాంటి సాయం అందలేదని రైతులు వాపోతున్నారు. గత ఖరీఫ్‌కు సంబంధించి 27 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా నేటికీ తమకు ఎలాంటి పరిహారం అందలేదని, రుణాల రీషెడ్యూల్ కూడా జరగలేదని రైతులు నిరాశతో చెప్తున్నారు. ఇప్పుడు, రబీకి ప్రాణప్రదమైన నవంబర్ నెలలో వర్షాభావం తీవ్రంగా వున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.

## ఆశలు రేకెత్తిస్తున్న 'నాదా'...

కాగా, చెన్నై సమీపంలో బంగాళాఖాతంలో ఏర్పడ్డ 'నాదా' తుఫాన్ మూలంగా గురువారం సాయంత్రం నుండి చిరు జల్లులు మొదలయ్యాయి. ఈ వర్షాలు నాలుగైదురోజుల పాటు సాగితే జిల్లా రైతాంగానికి ఊపిరి పోసినట్లే! నవంబర్ మొదటి వారంలో ఒకటి రెండురోజులు కురిసిన వర్షాలు ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయాయి. కనీసం ఐదారురోజులు ముసురుపడితే గాని జిల్లాలో నీటి కరువు తీరదు. రిజర్వాయర్లు, బావులు, బోర్లు నిండవు. 'నాదా' బుసలు కొడితే జిల్లాలో నీటి కొరత తీరినట్లే! తుస్సుమని మోహం చాటేస్తే మాత్రం ఈ సంవత్సరానికిక వానలు లేనట్లే! అంతా వరుణుడి దయ!..

# మారేది ప్రజలా? ప్రధానా?

(మొదటి పేజీ తరువాయి)

సర్వేలు పేర్కొంటూ వచ్చాయి. పెద్దనోట్ల రద్దు వల్ల ప్రజల్లో ఇమేజ్ పెరిగి ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ, దాని మిత్ర పక్షాలు మెరుగైన ఫలితాలు సాధిస్తే, ఆ ఘనతంతా కూడా మోడీదే! పెద్దనోట్ల రద్దుపై ప్రతిపక్షాలు చేసిందంతా కూడా రాద్ధాంతమే అవుతుంది. అదేగనుక ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీకి ఘోర పరాభవం ఎదురైతే... బీజేపీలో డైనమేట్లు అప్పుడు పేలడం మొదలవుతుంది. పార్టీలోనే ఆయనపై తిరుగుబాటు జరుగుతుంది. ఎంపీలంతా కూడా ఆయనకు వ్యతిరేకంగా ఏకమయ్యే అవకాశముంది. ఇప్పటి దాకా మోడీ భజన చేస్తున్న వాళ్లు కూడా దూరం జరుగుతారు. పార్టీ సీనియర్ నేతలంతా అప్పుడు తెరమీదకొస్తారు. ఎందుకంటే తమ పార్టీకి ఈ పరిస్థితి రావడాన్ని వాళ్లు జీర్ణించుకోలేరు కదా! ఇటీవల మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల స్థానిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయాలు సాధించినా, వాటిని ఈ పరిణామాలకు అన్వయించలేము. ఎందుకంటే అవి పూర్తి అధికార నియంత్రణలో జరిగిన ఎన్నికలు. అసెంబ్లీ ఎన్నికలకు, స్థానిక ఎన్నికలకు చాలా తేడా ఉంటుంది.

పెద్దనోట్ల రద్దు ముందువరకు కూడా కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం సమర్ధవంతంగానే పనిచేస్తుందన్న నమ్మకముంది. పాక్ ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ దాడులతో ప్రభుత్వ ప్రతిష్ట మరింతగా పెరిగింది. మోడీకి కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ ప్రత్యామ్నాయం కాలేకపోతున్నాడు. మిగతా విపక్షాలన్నీ తలోదారిలో ఉన్నాయి. కాబట్టి ఈసారి కూడా బీజేపీదే ప్రభుత్వం, మోడీయే ప్రధాని అన్న అభిప్రాయం సామాన్య ప్రజల్లో ఉంది.

అలాంటి వాతావరణాన్ని పెద్దనోట్ల రద్దు చెరిపేసింది. ప్రతిపక్షాలన్నీ ఒకే తాటిపైకి వచ్చే అవకాశాన్ని నరేంద్ర మోడీయే కల్పించినట్లయ్యింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విపక్షాలకు మోడీయే ఒక అస్త్రాన్ని అందించినట్లయ్యింది. పెద్దనోట్ల రద్దు ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై పడకుండా చేసేందుకు ఆయనకు ఇంకా రెండేళ్లకు పైనే సమయముంది. ఈలోపు రద్దు ప్రయోజనాలు ప్రజలకు చేరువకావచ్చు. జనధన్ ఖాతాలలో నేరుగా డబ్బులు వేసి వ్యతిరేకించిన ప్రజలనే మళ్లీ అభిమానించేలా కూడా చేసుకోవచ్చు. పెద్దనోట్ల రద్దుతో కోల్పోయిన ఇమేజ్‌ను తిరిగి తెచ్చుకోవడానికి, జరిగిన కష్టనష్టాలను ప్రజలు మర్చిపోవడానికి లోక్‌సభ ఎన్నికల నాటికి తగినంత గడువు వుంది. కాని యూపి, పంజాబ్ ఎన్నికలకు అంత గడువులేదే! మంచయినా, చెడయినా పెద్దనోట్ల రద్దు ప్రభావం ఈ ఎన్నికల్లో కనిపిస్తుంది. సానుకూల ఫలితాలు వస్తే బీజేపీలో ఇక మోడీని కదిలించలేరు. వ్యతిరేక ఫలితాలు వస్తే మాత్రం మోడీకి సెగ మొదలైనట్లే!

ప్రజలు మారాలని 70ఏళ్లుగా దేశంలో నెలకొన్న ఒక విధమైన వెనుకబాటుతనం పోవాలని మోడీ పెద్దనోట్లను రద్దు చేస్తూ కొత్తమార్పుకు శ్రీకారం చుట్టారు. అయితే ఈ ప్రయోగం మంచికంటే కూడా ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి దగ్గరదారులు ఏర్పరుస్తోంది. ఈ నేపథ్యంలో సహజంగానే ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. రేపటి పై రాష్ట్రాల ఎన్నికల్లో ఈ వ్యతిరేకత వ్యక్తమైతే, మోడీ ప్రజలను మార్చే సంగతి అటుంచితే, బీజేపీయే ప్రధానిని మార్చే అవకాశముంది.



## చంద్రబాబు మెడకు...
# గంట తగిలించారు!

**• పూలదండయ్యేనా... గుదిబండగా మారేనా?**

*పెద్దనోట్ల రద్దు... భారత దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సమస్య. ప్రపంచ దేశాలన్నీ ఉత్కంఠగా చూస్తున్న వింత! ప్రపంచంలోనే అతిపెద్ద నగదు లావాదేవీల మార్కెట్ భారత్! 90శాతం వ్యాపారాలు కరెన్సీ ద్వారానే జరుగుతుంటాయి. అలాంటి దేశంలో ఉన్న ఫళంగా పెద్దనోట్లను రద్దు చేశారు. ఇది కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం కాదు. అఖిలపక్షంలో చర్చించి అమలు చేసిన విధానమూ కాదు. కేవలం ప్రధాని నరేంద్ర మోడీ వ్యక్తిగత నిర్ణయం. ఆర్బీఐ గవర్నర్, మరో ముగ్గురు ఆర్థిక వేత్తల పర్యవేక్షణలో మాత్రమే జరిగిన ఫైనాన్షియల్ సర్జికల్ స్ట్రైక్ ఇది!*

పెద్దనోట్ల రద్దు మూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సంక్షోభంలో పడింది. డిసెంబర్ 30వ తేదీ దాకా పెద్దనోట్ల జమకు గడువుంది. అప్పటిదాకా ఎన్ని లక్షల కోట్లు జమవుతాయో చూసుకుని, ఆ తర్వాత ప్రధాని మోదీ కొన్ని నిర్ణయాలు ప్రకటించే అవకాశముంది. పెద్దనోట్ల రద్దు వల్ల దేశానికి మంచి జరిగి ప్రజల్లో సానుకూల స్పందనవస్తే ఆ ఖ్యాతి అంతా కూడా ప్రధానిగా నరేంద్ర మోడీ ఖాతాలోకే చేరుతుంది. కాని భవిష్యత్‌లో ఇది వికటిస్తే మాత్రం దానికి భారీ మూల్యం చెల్లించబోయేది భారతీయ జనతా పార్టీనే! ఒక్క ఆ పార్టీయే కాదు దానికి తోకలా అంటుకుని వున్న తెలుగుదేశం వంటి పార్టీలు కూడా!

పెద్దనోట్ల రద్దు విషయంలో ఎవరికీ చెప్పా పెట్టకుండా వ్యవహరించిన ప్రధాని నరేంద్రమోడీ, దాని తర్వాత తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకుగాను మిగతా నాయకుల భాగస్వామ్యం కోరుతుండడం విశేషం. అంటే దీని మూలంగా తలెత్తే వైఫల్యాలను తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా పంచడానికన్న మాట! ఈ కోవలోనే నగదు రహిత లావాదేవీలకు వేసిన కమిటీకి చంద్రబాబును కన్వీనర్‌గా నియమించారు. చంద్రబాబు కూడా ఇదేదో పెద్ద పదవనుకుని ఆనందంతో అంగీకరించాడు. ఈ కమిటీలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, సిక్కిం, పుదుచ్చేరి, ఒడిసా సీఎంలను సభ్యులుగా నియమించారు. దేశ వ్యాప్తంగా నగదు రహిత లావాదేవీలన్నవి చాలా సుదీర్ఘకాల ప్రక్రియ! ఇది ఇంద్రజాలం కాదు... ఒక్కరోజులో ప్రజలంతా కరెన్సీ నుండి కార్డ్‌కు మారడానికి! చాలా కసరత్తు చేయాలి. ఎంతో ప్రయత్నం చేసినా ఒక స్థాయి లావాదేవీల వరకు మాత్రమే నగదు రహిత వ్యాపారాలు చేయవచ్చు. చిన్న, చితక వ్యాపారాలలో కరెన్సీనే ప్రధానం. అగ్ర దేశాల్లో సైతం ఈరోజుకీ కరెన్సీ అమలులో వుంది. కాబట్టి చంద్రబాబు టీమ్‌కు ఇది కత్తిమీద సామే!

కాగా పెద్దనోట్ల రద్దు ప్రభావం చంద్రబాబు మీద కూడా పడే అవకాశముంది. దీనివల్ల సానుకూల ఫలితాలు వస్తే ప్రజలు మోడీకి జై కొడతారు. పెద్దనోట్ల రద్దును సమర్థించిన చంద్రబాబుకు వచ్చే క్రెడిట్ ఏమీ లేదు. కాని ప్రతికూల ఫలితాలు వస్తే మాత్రం రాష్ట్రంలో ప్రజలు ఆ కోపాన్ని చంద్రబాబుపైనే చూపిస్తారు. ఎందుకంటే ఇక్కడ బీజేపీ నామమాత్రం. ఆ పార్టీ మిత్ర పక్షంగా వుంది టీడీపీనే! అదీగాక పెద్దనోట్ల రద్దు ప్రకటన వెలువడగానే ప్రధానికి నేను వ్రాసిన లేఖతోనే పెద్దనోట్లు రద్దయ్యాయని ఈ ఘనత నాదేనన్నట్లు చంద్రబాబు ప్రకటించుకున్నాడు. పెద్దనోట్ల రద్దుతో ప్రజలకు సమస్యలు మొదలయ్యాయి. చిల్లర కొరతే కాకుండా, రైతులు, మధ్యతరగతి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోసాగారు. ముఖ్యంగా భూముల విలువలు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు వచ్చాయి. అన్నింటికంటే చంద్రబాబు అరచేతిలో స్వర్గం చూపించిన అమరావతి రైతుల బాధ వర్ణనాతీతం. అమరావతి రాజధానికని రైతుల నుండి 34వేల ఎకరాల భూమి సమీకరణ జరిపారు. రైతులకు స్థలా లిస్తామన్నారు. ఈ స్థలాల రేట్లను హైదరాబాద్ జూబ్లీహిల్స్ రేట్ల స్థాయికి తీసుకెళ్లారు. ఇప్పుడు అమరావతికి వచ్చేవాడు గాని, ఆ స్థాయి రేట్లు పెట్టి స్థలాలు కొనేవాళ్లు గాని వుండరు. అలాగే అమరావతి పరిసరాల్లో భూములను ఎకరా కోటిన్నర నుండి రెండు కోట్ల వరకు చెబుతున్నారు. ఇప్పుడు పెద్దనోట్ల రద్దుతో రియల్ ఎస్టేట్ పడిపోయింది. ఇక అమరావతి వైపు చూసే రియల్టర్లే వుండరు. అమరావతి పరిసరాల్లో ఎకరా పాతికలక్షలకు అడిగే దిక్కు కూడా లేదు. ఈ అమరావతి రైతులంతా కూడా పెద్దనట్లు రద్దు చేయించి చంద్రబాబు తమ పొట్ట కొట్టాడని రగిలిపోతున్నారు. నోట్ల రద్దు వ్యవహారంలో ప్రజల నుండి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో చంద్రబాబు తెలివిగా నాలుక మడత తిప్పాడు. నోట్ల రద్దు తనలోనే అసహనం పెంచుతుందంటూ కేంద్రంపై ఆరోపణలకు దిగాడు. ఇక రెండురోజులు ఆగివుంటే వామపక్షాలతో కలిసి ఈయన కూడా పెద్దనోట్ల రద్దు సమస్యలపై ఆందోళనకు దిగుండేవాడే! కాని ఈలోపే ప్రధాని తెలివిగా నగదు రహిత లావాదేవీల కమిటీ గంటను ఆయన మెడకే కట్టాడు. బాబు పెద్దనోట్ల రద్దు ప్రభావం నుండి తప్పించుకోలేడు! ఆయన మెడకు కట్టిన ఈ గంట గుదిబండగా మారుతుందో? లేక పూలదండగా మారుతుందో? వేచి చూడాల్సిందే!

# సుబ్బరామన్నకు నివాళి



మనసున్న మారాజు, మాజీ పార్లమెంటు సభ్యులు కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి 21వ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 1వ తేదీన నెల్లూరు రంగనాయకులపేటలోని రాఘవ కళ్యాణ మండపంలో ఆయన అభిమానులు, కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు సి.వి.శేషారెడ్డి, పి.చెంచలబాబు యాదవ్, ఉడతా వెంకట్రావ్, రఘురాం ముదిరాజ్, ఏసునాయుడు, సూర్యనారాయణరెడ్డి, పి.కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# అదే 'క్యూ'లు... అవే బాధలు

బాహుబలి-2 సినిమా విడుదలైతే 20రోజుల తర్వాతన్నా టిక్కెట్ కౌంటర్ల ముందు 'క్యూ'లు తగ్గుతాయేమోగాని, పెద్దనోట్లు రద్దుచేసి పాతిక రోజులు కావస్తున్నా బ్యాంకులు, ఏటిఎంల ముందు 'క్యూ'లు తగ్గడం లేదు సరికదా, డిసెంబర్ 1వ తేదీ అయితే బ్యాంకులు, ఏటిఎంల ముందు చాంతాడంత 'క్యూ'లు కనిపించాయి. ఏటిఎంలలో డబ్బు పెట్టిన గంటకల్లా ఖాళీ అవుతుండడంతో యధాఫలంగా వాటి ముందు 'నో క్యాష్' బోర్డులు వేలాడుతున్నాయి. ఉద్యోగులు, పింఛన్‌దారులు తమ ఖాతాల్లో పడ్డ జీతాన్ని, పింఛన్‌ను పూర్తి స్థాయిలో తీసుకునే అవకాశం లేదు. 10వేల రూపాయల వరకు మాత్రమే విత్‌డ్రా చేసుకునే వెసలుబాటు కల్పించారు. ఆ పదివేలు చిక్కడమే మహాప్రసాద్ అన్నట్లు ఉద్యోగులు క్యూలలో నిలబడ్డారు. మొత్తానికి కరెన్సీ కష్టాలతో క్షణం ఒక యుగంలా గడుస్తోంది.

# పక్షుల పండుగ బాగా జరుపుకుందాం..

**- జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**

ఈనెల 27 నుంచి 29వ తేది వరకు పక్షుల పండుగ నిర్వహిస్తామని, ఇందు కోసం ప్రభుత్వం 2కోట్ల నిధులను మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. సూళ్ళూరుపేటలో బుధవారం జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పండుగలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 12 కమిటీలను నియ మిస్తున్నామన్నారు. పక్షుల పండుగకు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఫ్లెమింగో ఫెస్టివల్‌కు ముఖ్యమంత్రి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, పక్షులు విడిది చేసే నేలపట్టు చెరువు, పులికాట్‌లలో నీరు లేదని, నేలపట్టులో నీరు లేకపోతే పక్షులు ఎలా వస్తాయన్నారు. నేలపట్టుకు పక్షులు అక్టోబర్‌లో వస్తాయని, నీరు లేకుంటే అవి తిరిగి వెళ్ళిపోతాయని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య ఏర్పడుతోందని,



ఈ సమస్యను అధికారులు ముందుగానే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళివుంటే బావుండేదన్నారు. టిడిపి నాయకుడు పరసారత్నం మాట్లాడుతూ, గత 14 సంవత్సరాలుగా ఫ్లెమింగో ఫెస్టివల్ ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

షార్ కంట్రోలర్ రాజారెడ్డి, తిరుపతి మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, ఆర్డీఓ శీనానాయక్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, పలువురు జడ్పీటిసిలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి సమక్షంలో
# వైయస్సార్సీపీలోకి విద్యార్థులు



నెల్లూరు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రూరల్ కార్యాలయంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో బుధవారం పలువురు విద్యార్థులు పార్టీ విద్యార్థి విభాగంలో చేరారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలతో విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నారని, విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడటం పద్ధతి కాదని సూచించారు. ప్రత్యేకహోదాపై పోరాటం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై విద్యార్థులు ఆకర్షితులై పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ నగరాధ్యక్షుడు తాటి వెంటేశ్వర్లు, గుండాల మధుసూదనరెడ్డి, జయవర్ధన్, శేషు, రాకేష్, నవీన్, విజయ్ పాల్గొన్నారు.




# మరో ప్రయోగానికి సిద్ధం

అంతరిక్ష విజయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన శ్రీహరికోటలోని షార్ సెంటర్ మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. ఈ నెల 7వ తేదీ ఉదయం 10.24గంటలకు షార్‌లోని మొదటి లాంచ్‌ప్యాడ్ నుండి పిఎస్ఎల్‌వి-సి36ను ప్రయోగించనున్నారు. ఈమేరకు సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఈ రాకెట్ ద్వారా 1235కిలోల బరువుగల రిసోర్స్‌శాట్-2ఏను కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. ఇస్రోకు పిఎస్ఎల్‌వి నమ్మకమైన సిరీస్. 1994 నుండి ఇప్పటివరకు పిఎస్ఎల్‌వి ద్వారా 42స్వదేశీ, 75విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టి ఉండడం ఇస్రో సత్తాకు నిదర్శనం.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com